# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 13-8-2023 RNI No.52865/93·Postal No.HQ/SD/258/2021-2023 సంపుటి:30 సంచిక:10 పేజీలు:6 వెల: రూ.1/-


# తెలంగాణలో ఫాక్స్ కాన్ మరో 400 మిలియన్ డాలర్ల పెట్టుబడి

హైదరాబాద్, ఆగష్టు 12: ప్రపంచంలోనే అతిపెద్ద ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థ ఫాక్స్‌కాన్ తెలంగాణలో మరో భారీ పెట్టుబడులను ప్రకటించింది. ఫాక్స్‌కాన్ ఇంటర్‌కనెక్ట్ టెక్నాలజీ (ఎఫ్ఐటీ) డైరెక్టర్ల బోర్డు తెలంగాణలో వి400 మిలియన్ల పెట్టుబడికి ఆమోదం తెలిపింది.

ఈ విషయాన్ని ఫాక్స్‌కాన్ ఇండియా ప్రతినిధి వి లీ ధృవీకరించారు. గతంలో ఫాక్స్‌కాన్ తెలంగాణలో వి150 మిలియన్ల పెట్టుబడులను ప్రకటించగా, ఇప్పుడు ప్రకటించిన పెట్టుబడి దీనికి అదనంగా రానుంది.

ఈ సందర్భంగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ట్వీట్ చేస్తూ, తమ వాగ్దానాలను నెరవేర్చడానికి ఫాక్స్ కాన్ సిద్ధంగా ఉందన్నారు. ఫాక్స్ కాన్ గ్రూపుతో తమ స్నేహం స్థిరంగా ఉందని తెలిపారు.

ఈ పెట్టుబడులు తెలంగాణ అభివృద్ధిని రుజువు చేస్తున్నాయని కేటీఆర్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

ఇది ఇలా ఉంటే రంగారెడ్డి జిల్లా పరిధిలోని కొంగరకలాన్‌లో ఫాక్స్‌కాన్ తయారీ ప్లాంట్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి.

ఈ యూనిట్‌లో రూ.1,656 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది ఫాక్స్ కాన్. ఈ నిర్మాణ పనులకు మే 15న కేటీఆర్ భూమి పూజ చేసిన సంగతి తెలిసిందే. వచ్చే ఏడాదిలో ఈ ప్లాంట్ లో కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి..

# నరాలను పోగులుగా చేసి.. రక్తాన్ని రంగుగా మార్చే నేతన్నలకు సలామ్ : మంత్రి కేటీఆర్



యాదాద్రి భువనగిరి, ఆగష్టు 12: నరాలను పోగులుగా చేసి.. రక్తాన్ని రంగుగా మార్చి.. గుండెల్ని కండెలుగా చేసి.. చెమట చుక్కల్ని చీరలుగా మార్చి.. పేగుల్ని వస్త్రాలుగా అందించి.. మనషులకు నాగరికత అద్దిన నేత కార్మికులందరికీ హృదయపూర్వకంగా సలామ్ అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్క్ అభివృద్ధి పనులకు మంత్రి జగదీశ్ రెడ్డితో కలిసి మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్థానిక బాలాజీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన చేనేత వారోత్సవాల్లో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు.

నేతన్నకు ప్రతీక మగ్గం అని కేటీఆర్ పేర్కొన్నారు. సీఎం కేసీఆర్‌కు నేతన్నల కష్టాలు తెలుసు. నేతన్నల సంక్షేమం కోసం భారతదేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ అనేక పథకాలు అమలు చేస్తున్నారు. చేనేత మిత్ర పేరుతో నూలు, రసాయనాల మీద 50 శాతం సబ్సిడీ ఇస్తున్నాం. నేతన్నకు చేయూత పేరిట పొదుపు పథకం తీసుకొచ్చాం. రైతుబీమా తరహాలో నేతన్నకు బీమా తెచ్చాం. ఇవన్నీ కేసీఆర్ సీఎం కావడం వల్లే సాధ్యమైందని మంత్రి కేటీఆర్ అన్నారు.

**పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్కు తర్వలోనే ఓపెన్..**

కనుముక్కులలో పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్కు మూతబడ్డదని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి తన దృష్టికి తీసుకొచ్చారని కేటీఆర్ గుర్తు చేశారు. నేతన్నలకు అక్కడ ఉపాధి కల్పించాలని ఎమ్మెల్యే కోరారు. వెంటనే పన్నెండున్నర కోట్లతో ప్రభుత్వమే కొనుగోలు చేసి, దాని తిరిగి తెరవబోతున్నాం.

చేనేత మిత్ర ద్వారా నెలకు రూ. 3 వేల చొప్పున ప్రతి కార్మికుడికి వచ్చే నెల నుంచి మీ ఖాతాల్లో జమ చేయబోతున్నాం. నేతన్నకు బీమా అర్హతను 75 ఏండ్లకు పెంచామన్నారు. దీని వల్ల వేలాది మంది నేతన్నలకు లాభం జరగనుంది. నేతన్నకు చేయూత ద్వారా.. 26 వేల కుటుంబాలకు రూ. 96 కోట్లను మెచ్యూరిటీ పూర్తి కాకుండానే కరోనా కాలంలో ఇచ్చామని కేటీఆర్ గుర్తు చేశారు.

**రూ. 40 కోట్లతో చేనేత మగ్గం కార్యక్రమం అమలు..**

తెలంగాణ చేనేత హెల్త్ కార్డు ద్వారా ఓపీ సేవల కోసం రూ. 25 వేలు ఇస్తున్నామని కేటీఆర్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి. మగ్గాలు ఆధునీకరించుకోవాలి. గుంట మగ్గాల స్థానంలో ఫ్రేమ్ లూమ్స్ తీసుకొస్తున్నాం. దీన్ని రూ. 40 కోట్లతో చేనేత మగ్గం అనే కార్యక్రమం కింద తీసుకొచ్చాం. ఇవన్నీ మీ కోసం తెచ్చిన పథకాలు.. వాడుకుంటే మీకే లాభం. మగ్గాలు నేసే నేతన్నలకు గుర్తింపు కార్డులు ఇస్తున్నాం. ఆ గుర్తింపు కార్డు ద్వారా.. పథకాల ప్రయోజనాలు పొందుతారు. గతంలో ఎవరైనా నేత కార్మికుడు చనిపోతే దహనసంస్కారాల నిమిత్తం టెస్కో నుంచి రూ. 5 వేలు అందించేవారు. కానీ ఇప్పుడు రూ. 25 వేలు ఇచ్చేలా నిర్ణయం తీసుకున్నాం. ఈ కార్యక్రమాన్ని త్వరలోనే అమలు చేయబోతున్నామని కేటీఆర్ పేర్కొన్నారు.

**మాది కోతల ప్రభుత్వం కాదు.. మాది చేతల, చేనేతల ప్రభుత్వం..**

మీ ఉత్పత్తులను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లే బాధ్యత ఉంది అని కేటీఆర్ తెలిపారు. ఉప్పల్‌లో హ్యాండ్లూమ్ మ్యూజియం ఏర్పాటు చేస్తుంది. పోచంపల్లి చేనేత కళాకారులు భాగస్వాములై వినియోగించుకోవాలి. నేత కార్మికులను సంఘటితం చేయాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం అండగా ఉంటుంది. పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్కు 22 ఎకరాల్లో ఉంది. దాన్ని బ్రహ్మాండంగా తయారు చేస్తాం. దాంట్లో వచ్చే లాభాలను మీ పోచంపల్లి మండలంలోని ప్రతి నేత కుటుంబానికి అందిస్తాం. ఆ ఓనర్‌షిప్‌ను మీకే అప్పజెప్తాం. వ్యవసాయం తర్వాత చేనేత రంగం అధిక మందికి ఉపాధి కల్పిస్తుంది. అగ్గిపెట్టె లో పట్టే చీరను నేసిన నైపుణ్యం ఉన్న నేతన్నలు మన తెలంగాణ నేతన్నలు. అందుకే మీ కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తుంది. మాది కోతల ప్రభుత్వం కాదు.. మాది చేతల ప్రభుత్వం.. చేనేతల ప్రభుత్వం. 2001లో భూదాన్ పోచంపల్లిలో నేతన్నలను కాపాడుకునే ప్రయత్నం చేశామని కేటీఆర్ వివరించారు.

# ముఖ్యమంత్రి కేసీఆర్‌కు నేతన్నల గుండెచప్పుడు తెలుసు : మంత్రి జగదీశ్‌రెడ్డి



నల్గొండ, ఆగష్టు 12:: చేనేత కార్మికుల కుటుంబాల్లో వెలుగులు నింపిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. నేతన్న ఇంట్లో విద్యాబుద్ధులు నేర్చుకున్న కేసీఆర్‌కు మగ్గాల చప్పుడే.. కాదు నేతన్నల గుండె చప్పుడు బాగా తెలుసునని చెప్పారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భం గా భూదాన్ పోచంపల్లిలో నిర్వహి స్తున్న వారోత్సవాల్లో ఐటీ, పురపాల కశాఖ మంత్రి కేటీఆర్‌తో కలిసి జగదీశ్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్యక్రమానికి భోనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి అధ్యక్షత వహించిన ఉత్సవాల్లో ప్రభుత్వ విప్ గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి, జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్యేలు గాధరి కిశోర్ కుమార్, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, రవీంద్ర నాయక్, చిరుమర్తి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ నేతన్నల గుండె చప్పుడు తెలిసినందునే ఉద్యమ కాలంలోనే.. ఉద్యమ నాయకుడిగా నేటి ముఖ్యమంత్రి కేసీఆర్ నాడు భూదాన్ పోచంపల్లి, సిరి ఓసిల్లలో పర్యటించి చేనేత కార్మికులను ఆదుకున్నారని ఆయన గుర్తుచేశారు. ఆదరణ, గుర్తింపు లేక పోవడంతో ఆత్మాభిమానంతో అప్పులు చెయ్యలేక ఆత్మహత్యలకు పాల్పడు తుంటే కలత చెందిన ముఖ్యమంత్రి కేసీఆర్ నాడు ఉద్యమ నాయకుడిగా జోలె పట్టుకుని వసూలు చేసిన మొత్తంలో చేనేత కార్మికులకు అండగా నిలిచిన సందర్భాన్ని ఆయన గుర్తుచేశారు. అందుకే అధికారంలోకి వచ్చిందే తడువుగా సమస్యను సత్వరమే అర్థం చేసుకోగలిగిన కేటీఆర్‌ను చేనేత జౌళీ శాఖ మంత్రిగా నియమించారన్నారు. మంత్రి కేటీఆర్ ప్రాతినిథ్యం వహిస్తున్న సిరిసిల్లలో ఎటు చూసినా కనిపించేది చేనేత కార్మికులేనని, ఈనాడు చేనేతలు ఇంతటి పురోగతి సాధించారన్నారు. నాడు అధికారంలో ఉన్న చంద్రబాబు ఆయన మద్దతుతో కేంద్రంలో కొలువుదీరిన ఎన్‌డీఏ ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన యూపీఏ -1, 2 ప్రభుత్వాలు చేనేత కార్మికులను వారి ఆత్మాభిమానాలను గుర్తించ లేక పోయారని మంత్రి దుయ్యబట్టారు.

# పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం బీజేపీ పోరుబాట

**-కార్యాచరణను ప్రకటించిన తెలంగాణ బీజేపీ**
**-16,17 తేదీల్లో బస్తీల సమస్యలపై "బస్తీల బాట"**
**-18న డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇవ్వాలని మండల కేంద్రాల్లో ధర్నాలు**
**-సెప్టెంబర్ 4న డబుల్ బెడ్ రూం ఇండ్ల సమస్యపై హైదరాబాద్‌లో విశ్వరూప ధర్నా**
**- బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి**

హైదరాబాద్ ఆగష్టు 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం బీజేపీ పోరుబాట పట్టింది. ఇందులో భాగంగా శనివారం తెలంగాణ బీజేపీ కార్యాచరణను ప్రకటించింది. ఈ సందర్భంగా రాష్ట్ర బీజేపీ చీఫ్ కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. డబుల్ బెడ్ రూం ఇండ్లపై ఉద్యమం చేపడతామని అన్నారు. ఈ నెల 16,17 తేదీల్లో బస్తీల సమస్యలపై "బస్తీల బాట" చేపడతామని.. బస్తీ, పేద ప్రజలను కలిసి సమస్యలపై దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు.

18న డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రాల్లో ధర్నాలు చేపట్టనున్నట్లు చెప్పారు. అలాగే 23, 24 తేదీల్లో అన్ని జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తామని, వచ్చే నెల 4న డబుల్ బెడ్ రూం ఇండ్ల సమస్యపై హైదరాబాద్‌లో విశ్వ రూప ధర్నా చేపట్టనున్నట్లు వెల్లడిం చారు. సీఎం కేసీఆర్ కండ్లు తెరిపించే విధంగా ధర్నా ఉంటుందన్నారు. ఇండ్లు ఇస్తారా.. గద్దె దిగుతారా అని టీఆర్ఎస్ నాయకులను ప్రశ్నించాలని.. నిలదీయాలని నేతలకు పిలునిచ్చారు.

డబుల్ బెడ్ రూం ఇండ్లు రావాలంటే బీజేపీ అధికారంలోకి రావాలన్నారు. కేసీఆర్ ప్రభుత్వం రజాకార్ల ప్రభుత్వమని పేద ప్రజలంతా బీజేపీతో కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఫామ్ హౌస్‌లో, ప్రగతి భవన్‌లో నిద్ర పోతున్నది కేసీఆర్ ప్రభుత్వమని విరుచుకుపడ్డారు. వరదలొచ్చిన సీఎం కేసీఆర్ బయటకు రారని కిషన్‌రెడ్డి వ్యాఖ్యలు చేశారు

# అవినీతిని అరికట్టడం భారత ప్రభుత్వానికి ప్రజల పట్లగల పవిత్ర కర్తవ్యం-ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, ఆగష్టు 12: ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇవాళ అవినీతి నిరోధంపై కోల్‌కతాలో నిర్వహించిన జి-20 సచివుల స్థాయి సమావేశంలో వీడియో సందేశం ద్వారా ప్రసంగించారు. ముందుగా నోబెల్ పురస్కార గ్రహీత అయిన గురుదేవుడు రవీంద్రనాథ్ టాగూర్ నగరం కోల్‌కతా వచ్చిన ప్రముఖులకు ఆయన స్వాగతం పలికారు. అవినీతి నిరోధంపై జి-20 సచివుల స్థాయి సమావేశం ప్రత్యక్షంగా నిర్వహించడం ఇదే తొలిసారి అని ఈ సందర్భంగా పేర్కొన్నారు. టాగూర్ రచనలను ప్రస్తావిస్తూ- ఎవరికైనా దురాశ తగదని, అది సత్యాన్వేషణకు అడ్డుగోడగా నిలుస్తుందని హెచ్చరించారు. ఈ మేరకు 'మా గృధా'.. అంటే- దురాశకు తావుండరాదు' అన్న ప్రాచీన భారతీయ ఉపనిషత్తు ఉద్బోధను ప్రధాని ఉటంకించారు.

ఏ దేశంలోనైనా అవినీతి దుష్ప్రభావం అత్యధికంగా పేదలు-అట్టడుగు వర్గాలపైనే పడుతుందని ప్రధానమంత్రి నొక్కి చెప్పారు. ఇది వనరుల వినియోగంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని, మార్కెట్‌లను తప్పుదోవ పట్టిస్తుందని, సేవల ప్రదానాన్ని దెబ్బతీస్తుందని, వీటన్నిటి పర్యవసానంగా ప్రజల జీవన నాణ్యత దెబ్బతింటుందని స్పష్టం చేశారు. కౌటిల్యుని అర్థశాస్త్రాన్ని ప్రస్తావిస్తూ- గరిష్ఠ స్థాయిలో ప్రజా సంక్షేమం కోసం జాతీయ వనరులు పెంచుకోవడం ప్రభుత్వ బాధ్యతగా పేర్కొన్నారని ప్రధానమంత్రి గుర్తుచేశారు. ఈ లక్ష్యసాధన దిశగా అవినీతిని ఎదుర్కోవాల్సిన అవసరం ఎంతయినా ఉందని ఆయన నొక్కిచెప్పారు. ప్రజల తరఫున ఇది ప్రభుత్వ పవిత్ర కర్తవ్యమని స్పష్టం చేశారు.

దేశంలో పారదర్శక-జవాబుదారీతనంతో కూడిన పర్యావరణ వ్యవస్థ సృష్టికి ప్రభుత్వం సాంకేతికతను, ఇ-పరిపాలనను సద్వినియోగం చేసుకుంటున్నదని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఆ మేరకు "అవినీతి సమూల నిర్మూలనపై భారతదేశానికి పటిష్ట విధానం ఉంది" అని వివరించారు. సంక్షేమ పథకాలు, ప్రభుత్వ పథకాలలో నిధుల దుర్వినియోగం, స్వాహాకు తావులేకుండా చూస్తున్నట్లు ఆయన తెలిపారు. దీనివల్ల దేశంలోని కోట్లాది ప్రజల బ్యాంకు ఖాతాలలోకి 360 బిలియన్ డాలర్లకుపైగా విలువైన ప్రత్యక్ష ప్రయోజనాలు బదిలీ అవుతున్నాయని పేర్కొన్నారు. తద్వారా 33 బిలియన్ డాలర్లకుపైగా ప్రజాధనం ఆదా అయిందని ప్రధానమంత్రి వెల్లడించారు. వ్యాపారాల కోసం ప్రభుత్వం వివిధ విధానాలను సరళీకరించిందని ప్రధాని తెలిపారు. ప్రభుత్వ సేవల యాంత్రీకరణ, డిజిటలీకరణతో సంపద సృష్టితో నిమిత్తంలేని వారు దాన్ని అనుభవించే అవకాశవాద కార్యకలాపాలకు వీల్లేకుండా చేశామని ఆయన ఉదాహరించారు. "ప్రభుత్వప రంగా కొనుగోళ్లలో మా ప్రభుత్వంలోని ఇ-మార్కెట్ ప్లేస్ లేదా 'జిఇఎం' పోర్టల్ ఎనలేని పారదర్శకత తెచ్చింది'' అని ప్రధానమంత్రి తెలిపారు. మరోవైపు 'ఆర్థిక నేరగాళ్ల చట్టం-2018' అమలులోకి తేవడాన్ని ప్రస్తావిస్తూ- ఆర్థిక నేరగాళ్లను ప్రభుత్వం నీడలా వెంటాడుతున్నదని, ఇటువంటి వారితోపాటు దేశం వదిలి పారిపోయిన ఆర్థిక నేరగాళ్ల నుంచి 1.8 బిలియన్ డాలర్ల విలువైన ఆస్తులు రాబట్టినట్లు ప్రధాని వివరించారు. ఇందులో భాగంగా 2014 నుంచి 12 బిలియన్ డాలర్లకుపైగా విలువైన నేరగాళ్ల ఆస్తులను కేసులకు జోడించడంలో అక్రమార్జన తరలింపు నిరోధక చట్టం తోడ్పాటు గురించి కూడా ఆయన వెల్లడించారు.

భారత ప్రధాని హోదాలో 2014లో తాను పాల్గొన్న తొలి జి-20 శిఖరాగ్ర సదస్సులో జి-20 దేశాలుసహా దక్షిణార్థ గోళంలోని దేశాలకు చెందిన ఆర్థిక నేరగాళ్లు పారిపోవడంపై సవాళ్లను ప్రస్తావించడాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. పరారీలోగల ఆర్థిక నేరగాళ్లపై చర్యలతోపాటు ఆస్తుల రికవరీ దిశగా తొమ్మిది అంశాల కార్యాచరణను కూడా సమర్పించినట్లు తెలిపారు. దీనిపై 2018నాటి జి-20 శిఖరాగ్ర సదస్సులో కార్యాచరణ బృందం నిర్ణయాత్మక చర్యలు తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. సమాచార భాగస్వామ్యం ద్వారా చట్టాల అమలులో సహకారం, ఆస్తుల రికవరీ యంత్రాంగాన్ని బలోపేతం చేయడం, అవినీతి నిరోధక అధికారుల నిజాయితీ-ప్రభావాల పెంపు వంటి మూడు ప్రాధాన్య రంగాల్లో చర్య ఆధారిత, ఉన్నత స్థాయి సూత్రాల అనుసరణను ప్రధానమంత్రి స్వాగతించారు. సరిహద్దులు దాటి పారిపోయేందుకు నేరగాళ్లు చట్టపరమైన లొసుగులను వాడుకోకుండా నిరోధించడానికి చట్టాల అమలు వ్యవస్థల మధ్య అనధికారిక సహకారంపై అవగాహన కుదరడం హర్షణీయమని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

అక్రమ ఆస్తులను సకాలంలో కనుగొనడానికే కాకుండా నేరపూరిత ఆర్జనను గుర్తించడానికీ సమ ప్రాధాన్యం ఉందని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. ఈ దిశగా అన్ని దేశాలూ తమ దేశీయ ఆస్తుల రికవరీ యంత్రాంగాల మెరుగును ప్రోత్సహించాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. అలాగే విదేశీ ఆస్తుల రికవరీని వేగిరం చేయడానికి నేరారోపణ-ఆధారిత జప్తు విధానాలను ఉపయోగించడం ద్వారా జి-20 దేశాలు ప్రపంచానికి అనుసరణీయ మార్గం చూపవచ్చునని శ్రీ మోదీ సూచించారు. తద్వారా న్యాయ ప్రక్రియ ముగిసిన తర్వాత నేరగాళ్లను త్వరగా స్వదేశాల్లోని చట్టాల అమలు సంస్థకు తిరిగి అప్పగించడం సులువు కాగలదన్నారు. "అవినీతిపై మన సామూహిక పోరాటానికి ఇది బలమైన సంకేతమిస్తుంది" అని ఆయన నొక్కి చెప్పారు.

అవినీతిపై యుద్ధంలో జి-20 దేశాల సమష్టి కృషి గణనీయంగా తోడ్పడుతుందని ప్రధానమంత్రి నొక్కి చెప్పారు. అలాగే అంతర్జాతీయ సహకారం మెరుగుదల, అవినీతి మూలకారణాల ఏరివేత వంటి పటిష్ట చర్యల అమలుద్వారా ఎంతో ప్రయోజనం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. అవినీతిపై పోరులో ఆడిట్ సంస్థల పాత్రను కూడా శ్రీ మోదీ ప్రముఖంగా ప్రస్తావించారు.

# చట్టంగా మారిన వివాదాస్పద ఢిల్లీ సర్వీసెస్ బిల్లు

**– బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తాజాగా ఆమోద ముద్ర**

న్యూ ఢిల్లీ ఆగష్టు 12 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); ఉద్యోగుల నియామకాలు, బదిలీల అధికారాన్ని లెఫ్టినెంట్ గవర్నర్‌కు కట్టబెడుతూ కేంద్రం రూపొందించిన వివాదాస్పద ఢిల్లీ సర్వీసెస్ బిల్లు చట్టంగా మారింది. పార్లమెంట్ ఉభయ సభల్లో ఆమోదం పొందిన ఈ బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తాజాగా ఆమోద ముద్ర వేశారు. ఢిల్లీ కేంద్ర రాజధాని ప్రాంత ప్రభుత్వం (సవరణ) బిల్లు-2023 పై ముర్ము శనివారం సంతకం చేశారు. దీంతో ఇది చట్టంగా అమల్లోకి వచ్చింది. ఢిల్లీ అధికారులపై కేంద్ర ప్రభుత్వ నియంత్రణ కల్పించేలా ఢిల్లీ సర్వీసెస్ బిల్లుకు కేంద్రం రూపకల్పన చేసిన విషయం తెలిసిందే. పాలనా యంత్రాంగంపై ఎన్నికైన ఢిల్లీ ప్రభుత్వ అధికారాలకు కత్తెర వేస్తున్న ఈ బిల్లును ఆప్ ప్రభుత్వం మొదటి నుంచి వ్యతిరేకిస్తూ వచ్చింది. ఈ మేరకు బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేసి తమ ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ విపక్ష పార్టీల మద్దతు కూడగట్టారు. అయినప్పటికీ అధికార, విపక్షాల ఆందోళనల మధ్య ఈ బిల్లు ఉభయ సభల్లో ఆమోదం పొందింది. ఈ బిల్లుపై తాజాగా రాష్ట్రపతి సంతకం చేయడంతో చట్టంగా మారింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ఆమోదించిన మరో మూడు బిల్లులకు రాష్ట్రపతి ఈరోజు ఆమోదం తెలిపారు. డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లు, జనన మరణాల నమోదు (సవరణ) బిల్లు, జన్‌విశ్వాస్ (నిబంధనల సవరణ) బిల్లులపై రాష్ట్రపతి నేడు సంతకం చేశారు. దీంతో ఈ బిల్లులు కూడా ఇప్పుడు చట్టంగా మారాయి.

# టీఎస్ ఆర్టీసీ 'గమ్యం' యాప్ డౌన్‌లోడ్ చేసుకోండిలా..!




హైదరాబాద్, ఆగష్టు 12:సాంకేతికతను అందిపుచ్చుకుని అత్యాధునిక ఫీచర్లతో బస్ ట్రాకింగ్ యాప్ గమ్యంను టీఎస్ ఆర్టీసీ అందుబాటులోకి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. హైదరాబాద్‌లో పుష్పక్ ఎయిర్‌పోర్టు, మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీసులకు, జిల్లాల్లో పల్లె వెలుగు మినహా అన్ని బస్సులకు ట్రాకింగ్ సదుపాయం కల్పించారు. మనం ప్రయాణించాల్సిన బస్సు ఎక్కడుంది.. ఏ సమయానికి మన వద్దకు వస్తుందనే విషయాలను గమ్యం యాప్ ద్వారా తెలుసుకోవచ్చు.

యాప్ డౌన్‌లోడ్ ఇలా..

'TSRTC Gamyam పేరుతో ఈ యాప్ గూగుల్ ప్లే స్టోర్లో అందుబాటులో ఉంది. టీఎస్ఆర్టీసీ అధికారిక వెబ్‌సైట్ http://tsrtc.telangana.gov.in నుంచి కూడా ఈ యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవచ్చు. ఈ యాప్ డౌన్‌లోడ్‌కు ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు. ఈ యాప్‌లో ప్రయాణికులు ఎలాంటి వ్యక్తిగత వివరాలు ఇవ్వాల్సిన అవసరం లేదు. తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో ఈ యాప్ అందుబాటులో ఉంది. గమ్యం యాప్‌ను ప్రజలందరూ తమ స్మార్ట్ ఫోన్‌లలో డౌన్ లోడ్ చేసుకోవాలి.

ఇప్పటికే ఇన్ స్టాల్ చేసుకుంటే అప్ డేట్ చేసుకోవడం తప్పనిసరి. టీఎస్ఆర్టీసీ తీసుకువచ్చిన ప్రతి కార్యక్రమాన్ని ప్రజలందరూ ఆదరించి, ప్రోత్సహించారు. నరికొత్త ఫీచర్లతో అందుబాటులోకి తీసుకువచ్చిన ఈ యాప్‌ను అలానే ఆదరించాలని సంస్థ కోరుతోంది. ఈ యాప్ పై ఫీడ్ బ్యాక్ ను ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తోంది టీఎస్ ఆర్టీసీ.

# శంషాబాద్ ఎయిర్ పోర్ట్ లో 8 కిలోల బంగారం పట్టివేత

హైదరాబాద్, ఆగష్టు 12:శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో మరోసారి అక్రమంగా పెద్ద ఎత్తున్న బంగారాన్ని తరలిస్తుండగా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎవరి కంటపడకుండా ఎనిమిది కిలోల బంగారాన్ని పలువురు వ్యక్తులు తరలిస్తుండగా కస్టమ్స్ అధికారులు చాకచక్యంగా పట్టుకున్నారు. పట్టుకున్న బంగారం విలువ రూ.4.86కోట్ల విలువ ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

బ్యాంకాక్ నుంచి వచ్చిన ఇద్దరి నుంచి 3.78 కిలోల బంగారం, షార్జా నుంచి వచ్చిన వ్యక్తి నుంచి 2.17 కిలోలు, దుబాయి నుంచి వచ్చిన వ్యక్తి నుంచి 2.5 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు కస్టమ్స్ అధికారులు తెలిపారు. ఆ వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి.

# చిక్కిన ఎలుగుబంటి.. ఊపిరి పీల్చుకున్న స్థానికులు

(నేటినిజం ప్రతినిధి): జిల్లాలో ఓ ఎలుగుబంటి హల్ చల్ చేసింది. అడవుల నుండి ఎలుగుబంటి జనవాసాల మధ్యకు వచ్చింది. బొమ్మకల్ సమీపంలో ఎలుగుబంటి తిరగడం గమనించిన స్థానికులు తీవ్ర భయాందోళనకు గురై.. వెంటనే ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు.సమాచారం అందుకున్న అధికారులు హుటాహుటిన రంగంలోకి దిగి ఎలుగుబంటిని పట్టుకునేందుకు అపరేషన్ చేపట్టారు.

దాదాపు 12 గంటల పాటు అధికారులను ముప్పు తిప్పులు పెట్టిన ఎలుగుబంటి ఎట్టకేలకు శనివారం మధ్యాహ్నం రేకుర్తి వద్ద చిక్కింది.మత్తు ఇంజెక్షన్ ఇవ్వడంతో ఎలుగుబంటి స్పృహ కోల్పోయింది.

నేటి కందం– నేటికి అందం

కం॥ నవవధువున దాతృత్వపు
చవిచూపుచు సేవ జేయు సన్మార్గుల-కీ
అవయవదాన దినమ్మున
ప్రవిమల గౌరవము నొసగి ప్రగణుల జేయన్॥

(ఆగష్టు 13 అవయవదాన దినం..)
Augut 12 Organ Donar's Day..)



-రాధశ్రీ
సెల్:9494481210

# పాక్, చైనాకు కౌంటర్‌గా.. శ్రీనగర్ బేస్‌కు మిగ్-29 ఫైటర్ విమానాలు

శ్రీనగర్ ఆగస్ట్ 12 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: పాకిస్థాన్, చైనా నుంచి వస్తున్న సరిహద్దు సమస్యలను ఎదుర్కొనేందుకు శ్రీనగర్ బేస్‌ను మరింత పటిష్టం చేశారు. ఆ బేస్ వద్ద ఇప్పుడు మిగ్-29 యుద్ధ విమానాలకు చెందిన స్క్వాడ్రన్‌లను మోహరించారు. మిగ్-21 బృందాల స్థానంలో ఇప్పుడు మిగ్-29 బృందాలు పనిచేయనున్నాయి. ఈ బృందాన్ని డిఫెండర్ ఆఫ్ నార్త్‌గా పిలుస్తున్నారు. మిగ్-29 చాలా అప్‌గ్రేడ్ యుద్ధ విమానాలని పైలెట్ స్క్వాడ్రన్ లీడర్ శివమ్ రాణా తెలిపారు. నైట్ విజన్ గగూల్స్‌తో ఈ విమానాలను రాత్రి పూట కూడా ఆపరేట్ చేయవచ్చు అన్నారు. ఎయిర్ టు ఎయిర్ రీఫ్యుయలింగ్ సామర్థ్యం ఉన్న కారణంగా .. వీటిని లాంగ్ రేంజ్‌లో కూడా ఆపరేట్ చేయవచ్చు అని చెప్పారు. భారతీయ వైమానిక దళానికి చెందిన పైలెట్లే ఈ విమానాలను ఆపరేట్ చేస్తున్నట్లు తెలిపారు. కశ్మీర్ లోయలో శ్రీనగర్ చాలా ఎత్తు ప్రదేశంలో ఉందని, ఇలాంటి ప్రదేశంలో మిగ్-29 యుద్ధ విమానాన్ని మోహరించడం చాలా ఉపయుక్తంగా ఉంటుందని ఐఏఎఫ్ పైలెట్ స్క్వాడ్రన్ లీడర్ విపుల్ శర్మ తెలిపారు. లాంగ్ రేంజ్ మిస్సైళు లాంచ్ చేయడానికి వీలుగా ఉంటుందన్నారు.

# ఐసెట్ కౌన్సెలింగ్ సెప్టెంబర్ 6 కు వాయిదా

హైదరాబాద్ ఆగష్టు 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: టీఎస్ ఐసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు జరిగాయి. ఈ నెల 14 నుంచి జరగాల్సిన ఐసెట్ కౌన్సెలింగ్‌ను వాయిదా వేశారు. సెప్టెంబర్ 6 నుంచి కౌన్సెలింగ్ నిర్వహించను న్నారు. 8 నుంచి 12వ తేదీ వరకు అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించనున్నారు. 8 నుంచి 13 వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవడానికి సమయం ఇచ్చారు. సెప్టెంబర్ 17వ తేదీన ఎంబీఏ, ఎంసీఏ తొలి విడుత సీట్లను కేటాయించనున్నారు. సెప్టెంబర్ 22 నుంచి ఐసెట్ తుది విడుత కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.

# కాకుమాను జ్యోతికి లిటిల్ చాంప్స్ అకాడమీ ఆఫ్ ఇండియా లైఫ్ టైమ్ అచీవ్ అవార్డ్మెంట్

హైదరాబాద్ ఆగష్టు 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్);లోటస్ కల్చరల్ ఆర్గనైజేషన్ ,లిటిల్ చాంపియన్ అకాడమి ఆఫ్ ఇండియా సంయుక్త ఆద్వర్యం లో బొగ్గుల కుంట లోని ఆంధ్ర సారత్వీక పరిషత్ లో జరిగిన కార్యక్రమం లోహెల్ టాటా మణి ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక చైర్‌పర్సన్ కాకుమాను జ్యోతికి లిటిల్ చాంప్స్ అకాడమీ ఆఫ్ ఇండియా లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డ్ తో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రం లో తెల్ల రవి కుమార్, బరద్వాజ్ ,రవిబాబు,ఎస్. సుబ్బా రావు,సుబీస్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# దళితుల అభ్యున్నతికి ప్రణాళికాబద్ధంగా చర్యలు : మంత్రి కొప్పుల



కరీంనగర్, ఆగష్టు 12:దళితుల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. శుక్రవారం పెద్దపల్లి మార్కెట్ యార్డులో ఎస్సీ యూనిట్లను జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ పుట్ట మధుకర్, పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డితో కలిసి పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బ్యాంకు లింకేజీ తో సంబంధం లేకుండా చిరు వ్యాపారాలు చేసుకునేందుకు దళితులకు రూ. 50 వేల యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. బ్యాంగిల్ షాపులు, పూజ సామాగ్రి దుకాణం, పూల దుకాణం, టీ షాప్ వంటి చిరు వ్యాపారాలు చేసుకునేందుకు ప్రభుత్వం సహాయం చేసిందని అన్నారు. సీఎం కేసీఆర్ దళితుల కోసం ఉన్న గురుకుల పాఠశాలలను, మహిళ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేశారని వివరించారు.

విదేశాలలో చదివే దళిత యువత కోసం అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్షిప్ పథకం అమలు చేస్తున్నారని తెలిపారు. దళితులు అధికంగా నివసించే ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం, త్రాగునీటి సరఫరా, వంద యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా వంటి అనేక మౌలిక వసతులను ప్రభుత్వం కల్పిస్తుందని అన్నారు. గత ప్రభుత్వాలు స్వయం ఉపాధి కింద దళితులకు కేవలం 20 శాతం మాత్రమే సబ్సిడీ అందించేవని వెల్లడించారు. సీఎం కేసీఆర్ దళితుల కోసం వంద శాతం సబ్సిడీతో బ్యాంకు లింకేజీ లేకుండా 10 లక్షలు సహాయం అందించేందుకు దళిత బంధు పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు.

ఈ పథకం ద్వారా దళితులు ఆర్థిక పురోగతి సాధిస్తున్నారని, సిరిసిల్ల జిల్లాలో 5 గురు దళితులు కలిసి రైస్ మిల్ ఏర్పాటు చేశారని అన్నారు. దళిత బంధు పథకం ద్వారా సంపద సృష్టి జరుగుతుందని, ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుందని చెప్పారు. రెండవ విడత దళిత బంధు కింద ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 1100 చొప్పున రాష్ట్రవ్యాప్తంగా దళిత బంధు పథకాన్ని అమలు చేస్తామని మంత్రి అన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ కింద రూ. 50 వేల యూనిట్లు అందుకున్న వారికి సైతం భవిష్యత్తులో దళిత బంధు అమలు అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్, పెద్దపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ మమతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కులవృత్తుల వారి అభివృద్ధే కేసీఆర్ ధ్యేయం- సభాపతి పోచారం



నిజామాబాద్, ఆగష్టు 12: కులవృత్తుల వారి అభివృద్ధే కేసీఆర్ ధ్యేయమని శాసన సభాపతి పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజకవర్గంలోని బీసీ బంధు పథకం లబ్ధిదారులకు చెక్కులు పోచారం శ్రీనివాస్ రెడ్డి పంపిణీ చేశారు. బాన్సువాడ డివిజన్ కేంద్రంలోని బీసీ బంధు పథకం లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ? బీసీ బంధు పథకం నిరంతర ప్రక్రియ అని, వంతుల వారిగా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులందరికీ ప్రభుత్వం తరపున కుల వృత్తుల వారికి నగదు లక్ష రూపాయలు అందజేయడం జరుగుతుందన్నారు. ఎలాంటి ధోకా లేదని, ప్రతి లబ్ధిదారులు ప్రభుత్వం నుండి లక్ష రూపాయలు తీసుకున్న తర్వాత వృధా చేయకుండా డబ్బులు సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులకు ఆయన సూచించారు. గతంలో తీసుకున్న రుణాలు బ్యాంకు నుండి సబ్సిడీ తీసుకుని అప్పుల పాలైన సంఘటనలు ఎన్నో ఉన్నాయని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. కుల వృత్తుల వారు ప్రతి పైసాను అభివృద్ధి కోసం ఖర్చు చేసినప్పుడే ప్రభుత్వానికి మంచి గుర్తింపు వస్తుందన్నారు.

జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ? బాన్సువాడలో లబ్ధిదారులు తీసుకున్న రుణాలను సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని యావత్ రాష్ట్రానికే బాన్సువాడ లబ్ధిదారులు ఆదర్శంగా నిలవాలని ఆయన లబ్ధిదారులకు సూచించారు. లక్ష రూపాయలను ఏ పని నిమిత్తం తీసుకుంటున్నారో వాటిని తమ అధికారులు తనిఖీకి వచ్చినప్పుడు చెప్పాలని ఆయన లబ్ధిదారులకు కోరారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ ఎంపీపీ దొడ్ల నీరజ వెంకటరామిరెడ్డి, జడ్పీటీసీ పద్మ గోపాల్ రెడ్డి, నసుల్లాబాద్ ఎంపీపీ విట్టల్, సొసైటీ చైర్మన్ పెరిక శ్రీనివాస్, కామారెడ్డి జిల్లా పరిషత్ కో ఆప్షన్ నెంబర్ మజీద్, ఆత్మ కమిటీ చైర్మన్ మోహన్ నాయక్, కామారెడ్డి జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షులు అంజిరెడ్డి, బాన్సువాడ మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిలో దేశంలోనే తెలంగాణ ఆదర్శం

**-సమస్యలు అడిగి తెలుసుకున్న మంత్రి**



హైదరాబాద్, ఆగష్టు 12: సీఎం కేసీఆర్ కృషితో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో దేశంలోనే ఆదర్శంగా నిలుస్తుందని కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్ మండలంలోని మునీరాబాద్, పూడూర్, రాజబొల్లారం, రాజబొల్లారం తండా పంచాయతీల పరిధి గ్రామాల్లో గురువారం మంత్రి పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో మంత్రి స్థానిక నేతలతో కలిసి పర్యటిస్తూ స్వయంగా ప్రజలతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజబొల్లారంలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమరా లను ప్రారంభించి, నూతన బస్టాంట్ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. అదే విధంగా పూడూర్ పంచాయతీ అనుబంధ గ్రామమైన గోసాయిగూడలో యువజన సంఘం భవనాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ఏర్పాటు అనంతరం పేదల సంక్షేమంలో సీఎం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి సమర్థవంతంగా అమలు చేస్తున్నాడని అన్నారు. నేడు ఏ గ్రామంలో చూసినా వైకుంఠధామం, డంపింగ్ యార్డు, పల్లె ప్రకృతి వనాలు, హరితహారంతో పచ్చదనం, రోడ్లు, అంతర్గత సీసీ రోడ్లతో అభివృద్ధి కనబడుతున్నదని అన్నారు. ఆసరా పింఛన్లు, రైతుబంధు, దళితబంధు, కల్యాణలక్ష్మి,కేసీఆర్ కిట్, రైతులకు 24 గంటల ఉచిత కరెంట్తో ప్రజలకు ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. మేడ్చల్ నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకుపోతున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్చార్జి మహేందర్రెడ్డి, ఎంపీపీ రజితా రాజమల్లారెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటేశ్, ఆయా గ్రామాల సర్పంచ్లు గణేశ్, బాబు యాదవ్, మాంగ్యా నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్ యాదవ్, ఆదర్శ రైతు సేవా సహకార సంఘం చైర్మన్ సుధాకర్రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దయానంద్ యాదవ్, నాయకులు శ్రీనివాస్రెడ్డి, రాజమల్లారెడ్డి, జగన్రెడ్డి, నారాయణ, సత్యనారాయణ, సుదర్శన్, వెంకటేశ్, మహేశ్, రవినాయక్, గ్రామ వార్డు సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**పూడూర్లో మంత్రికి ఘన స్వాగతం**

మంత్రి పర్యటనలో భాగంగా పూడూర్ గ్రామంలో స్థానిక కుల సంఘాల నేతలు, సభ్యులు, కళాకారులు పలు వేషధారణలతో డప్పు చప్పుళ్లు, మేళతాలాలతో మంత్రికి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి గ్రామంలో ఆలయాల వద్దకు వెళ్లి ప్రత్యేక పూజ లు నిర్వహించి, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండేలా దీవించాలని దేవతలను వేడుకున్నారు.

**పలు అభివృద్ధి పనులకు మంత్రి హామీ..**

మేడ్చల్ మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించిన మంత్రి మల్లారెడ్డి అసంపూర్తి పనులను సొంత డబ్బులు వెచ్చించి పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా మునీరాబాద్లో అసంపూర్తిగా ఉన్న సీసీ రోడ్లు, గడిమైసమ్మ, పోచమ్మ ఆలయాలను పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. అదే విధంగా పూడూర్ గ్రామ పరిధిలో గౌడ, యాదవ, రజక, కుమ్మరి సంఘాల భవనాల నిర్మాణానికి భూమి పూజ చేసి, పెద్దమ్మగుడి నిర్మాణానికి, మజీద్ వద్ద షెడ్డు నిర్మాణానికి ఆర్థిక సహాయం అందిస్తానని, సీసీ రోడ్లు వేయిస్తానని హామీ ఇచ్చారు. గోసాయిగూడలో బీరప్పగుడి, భూలక్ష్మీ దేవి గుడుల మరమ్మతులు చేస్తానని తెలిపారు. అదే విధంగా రాజబొల్లారం గ్రామ పరిధిలో కట్టమైసమ్మ, పెద్దమ్మ గుడి, సీసీ రోడ్ల నిర్మాణానికి సహకారం చేస్తానని, రాజబొల్లారం తండాల్లో సీసీ రోడ్లు వేయిస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

# సరస్ ఆజీవిక స్టోర్లో 'ఒక జిల్లా ఒక ఉత్పత్తి' వాల్ను సంయుక్తంగా ప్రారంభించిన డీపీఐఐటీ, కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ, ఆగష్టు 12:దేశీయ హస్తకళలు, కళాకారులను ప్రోత్సహించేందుకు, కేంద్ర వాణిజ్యం ఉ పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని పరిశ్రమలు ఉ అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం (డీపీఐఐటీ) ప్రారంభించిన కార్యక్రమం పేరు 'ఒక జిల్లా ఒక ఉత్పత్తి' (ఓడీఓపీ). ఈ కార్యక్రమం కింద, కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ సహకారంతో సారస్ ఆజీవిక స్టోర్లో ఓడీఓపీ వాల్ ప్రారంభమైంది. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి శ్రీ చరణ్జిత్ సింగ్, డీపీఐఐటీ డైరెక్టర్ శ్రీమతి సుప్రియా దేవస్థలి ఈ వాల్ను నిన్న ఆవిష్కరించారు. సరస్ ఆజీవిక స్టోర్లోని ఓడీఓపీ వాల్ ఈ రెండు మంత్రిత్వ శాఖల భాగస్వామ్యానికి గుర్తుగా నిలుస్తుంది.కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, దీనదయాళ్ అంత్యోదయ ద్వారా సరస్ ఆజీవిక కార్యక్రమాన్ని ప్రారంభించింది. సరస్ ఆజీవిక మహిళా సాధికారతకు విలువైన మద్దతుదారుగా నిలుస్తుంది. మహిళా కళాకారులు, స్వయం సహాయక సంఘాల (ఎస్హెచ్జీలు) అభ్యున్నతిపై ప్రత్యేక దృష్టి పెడుతుంది. మహిళలు, స్వయం సహాయక సంఘాలు రూపొందించిన ఉత్పత్తులకు ప్రత్యేక మార్కెట్ను సృష్టించడం ద్వారా వారి నైపుణ్యం, ప్రతిభను పెంచుతుంది. తద్వారా, మహిళలు స్వయం వ్యాపారవేత్తలుగా మారడంలో సాయం చేస్తుంది.

ఉత్పత్తులకు ట్యాగింగ్, స్టోరీ కార్డులు వంటి వినూత్న లక్షణాలను ఆపాదించడానికి గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖతో ఓడీఓపీ కార్యక్రమం చేతులు కలిపింది. ఈ అదనపు లక్షణాలు వినియోగదార్లను ఆకర్షిస్తాయి, తద్వారా ఉత్పత్తుల అమ్మకాలను పెంచుతాయి.

దేశంలోని అన్ని జిల్లాలను సమానంగా అభివృద్ధి చేయడం ద్వారా దేశాన్ని, ప్రజలను స్వావలంబనగా తీర్చిదిద్దాలన్న ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికతను నిజం చేయడం ఓడీఓపీ లక్ష్యం. ఈ కార్యక్రమం కింద ప్రతి జిల్లా నుంచి ఒక ప్రత్యేక ఉత్పత్తిని ఎంపిక చేస్తారు. దానికి బ్రాండింగ్ కల్పించి, ప్రచారం చేస్తారు. ఇలా, దేశవ్యాప్తంగా చేనేత, హస్తకళలు సహా వివిధ రకాల ఉత్పత్తులను ప్రచారం చేస్తారు. భారతదేశాన్ని విలక్షణ నైపుణ్యం, వ్యవస్థాపకతతో వర్ధిల్లే స్వయం సమృద్ధి కేంద్రంగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలతో సహకారాన్ని ఓడీఓపీ కొనసాగిస్తుంది.

# కొండచరియలు విరిగిపడి కారులో ఉన్న అయిదుగురు మృతి

న్యూఢిల్లీ, ఆగష్టు 12:ఉత్తరాఖండ్లో కొండచరియలు విరిగిపడ్డాయి. రుద్రప్రయాగ్ జిల్లాలో ఈ ఘటన జరిగింది. కారుపై కొండచరియలు విరిగిపడడంతో అందులో ఉన్న అయిదుగురు మృతి చెందారు. శిథిలాలను తొలగించే పనిలో అధికారులు ఉన్నారు. రోడ్డును క్లియర్ చేసేందుకు రెస్క్యూ టీమ్ పనిచేస్తోంది. చార్థామ్ యాత్రలో ఉన్న అయిదుగురు యాత్రికులు చనిపోయినట్లు అధికారులు వెల్లడించారు. బాధితులు గుజరాత్కు చెందినట్లు అధికారులు చెప్పారు. వాళ్లంతా కేదార్నాథ్ వెళ్తున్నట్లు తెలిపారు.

కేదార్నాథ్ హైవేపై ఉన్న కొండచరియలు విరిగిపడ్డాయి. తార్సలి వద్ద భారీ రాళ్లు కారుపై వచ్చి పడ్డాయి. ఆ కారు పూర్తిగా శిథిలాల కింద చిక్కుకుపోయింది. గుప్తకాశీ-గౌరీకుండ్ హైవేను కూడా మూసివేశారు. ఆ రూట్లో దాదాపు 60 మీటర్ల రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయింది. చౌకీ జవాది, కోత్వాలి రుద్రప్రయాగ్, చకీ తిల్వాడా, తానా అగస్త్యముని, కాక్దాగా ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించింది. గత కొన్ని రోజుల నుంచి రుద్రప్రయాగ్తో పాటు ఇతర ప్రాంతాల్లో ఏకధాటిగా వర్షం కురుస్తోంది. ఆగస్టు 11 నుంచి 14వ తేదీ వరకు రెడ్ అలర్ట్ జారీ చేశారు.

# ఉల్లి బఫర్ నుంచి 3 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వలను విడుదల చేసిన కేంద్రం

న్యూఢిల్లీ, ఆగష్టు 12:ఈ సంవత్సరం ఏర్పాటు చేయబడిన 3.00 లక్షల మెట్రిక్ టన్నుల ఉల్లిపాయల బఫర్ నుండి తాజాగా నిల్వలను విడుదల చేయడాన్ని ప్రారంభించాలని వినియోగదారుల వ్యవహారాల శాఖ నిర్ణయించింది. వినియోగదారుల వ్యవహారాల శాఖ కార్యదర్శి శ్రీ రోహిత్ కుమార్ సింగ్ 10.08.2023న నాఫెడ్ మరియు ఎన్.సి.సి.ఎఫ్. మేనేజింగ్ డైరెక్టర్లతో సమావేశమయ్యారు. మార్కెట్ డిస్పోజల్ సంబంధించిన విధివిధానాలను ఖరారు చేశారు. రిటైల్ ధరలు ఆల్-ఇండియా సగటు కంటే ఎక్కువగా ఉన్న రాష్ట్రాలు లేదా ప్రాంతాలలో కీలక మార్కెట్లను లక్ష్యంగా చేసుకుని ఉల్లి నిల్వలను విడుదల చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. గత నెల మరియు సంవత్సరంలో ధరల పెరుగుదల రేట్లు థ్రెషోల్డ్ స్థాయి కంటే ఎక్కువగా ఉన్నాయి. ఇ-వేలం ద్వారా డిస్పోజల్ మరియు ఇ-కామర్స్ ప్లాట్ఫారమ్లలో రిటైల్ విక్రయాలు కూడా అన్వేషించబడుతున్నాయి. వినియోగదారులకు సరసమైన ధరలకు ఉల్లిపాయలను అందుబాటులో ఉంచే లక్ష్యంతో ధరలు మరియు లభ్యత పరిస్థితులతో డిస్పోజల్ యొక్క పరిమాణం మరియు వేగం కూడా క్రమాంకనం చేయబడుతుంది. మార్కెట్ డిస్పోజల్ కాకుండా, రాష్ట్రాలకు వారి వినియోగదారుల సహకార సంఘాలు మరియు కార్పొరేషన్ల రిటైల్ అవుట్లెట్ల ద్వారా విక్రయించడానికి తగ్గింపు ధరలకు అందించాలని కూడా నిర్ణయించారు. మార్కెట్ డిస్పోజల్ కాకుండా రాష్ట్రాలకు వారి వినియోగదారుల సహకార సంఘాలు మరియు కార్పొరేషన్ల రిటైల్ అవుట్లెట్ల ద్వారా విక్రయించడానికి.. తగ్గింపు ధరలకు అందించాలని కూడా నిర్ణయించారు. ప్రస్తుత సంవత్సరంలో, బఫర్ కోసం మొత్తం 3.00 లక్షల మెట్రిక్ టన్నుల ఉల్లిని సేకరించారు, పరిస్థితిని బట్టి దానిని మరింత పెంచవచ్చు. రెండు కేంద్ర నోడల్ ఏజెన్సీలు.. అవి నాఫెడ్ మరియు ఎన్.సి.సి.ఎఫ్. మహారాష్ట్ర మరియు మధ్యప్రదేశ్ నుండి జూన్ మరియు జూలైలో ఒక్కొక్కటి 1.50 లక్షల మెట్రిక్ టన్నుల ఉల్లిని సేకరించాయి. ఈ సంవత్సరం, నిల్వ నష్టాన్ని తగ్గించే లక్ష్యంతో భాభా అటామిక్ రీసెర్చ్ సెంటర్ (బార్క్) సహకారంతో పైలట్ ప్రాతిపదికన ఉల్లికి రేడియేషన్ కూడా చేపట్టారు.

సుమారు 1,000 ఎంటీలు రేడియేషన్ చేయబడింది మరియు నియంత్రిత వాతావరణ నిల్వలో నిల్వ చేయబడింది .ఉల్లి ధరల అస్థిరతను తనిఖీ చేసేందుకు ధరల స్థిరీకరణ నిధి కింద ప్రభుత్వం ఉల్లి బఫర్ను నిర్వహిస్తోంది. లీన్ సీజన్లో ప్రధాన వినియోగ కేంద్రాల లో విడుదల చేయడానికి రబీ పంట నుండి ఉల్లిపాయలను సేకరించడం ద్వారా వార్షిక బఫర్లను నిర్మించారు. గత నాలుగు సంవత్సరాలలో ఉల్లిపాయ బఫర్ పరిమాణం మూడు రెట్లు పెరిగింది; 2020-21లో 1.00 లక్షల మెట్రిక్ టన్నుల నుండి 2023-24లో 3.00 లక్షల మెట్రిక్ టన్నులకు చేరింది. వినియోగదారులకు సరసమైన ధరలకు ఉల్లిపాయల లభ్యతను నిర్ధారించడంలో మరియు ధర స్థిరత్వాన్ని కొనసాగించడంలో ఉల్లి బఫర్ కీలక పాత్ర పోషిస్తోంది.

# మోదీ ప్రభుత్వంపై కేంద్ర మంత్రి జైశంకర్ కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ ఆగష్టు 12 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: గత ప్రభుత్వాల హయాంలో కొన్ని సైద్ధాంతిక కారణాల వల్ల దేశ ప్రయోజనాలను త్యాగం చేశారని విదేశాంగ మంత్రి సుబ్రహ్మణ్యం జైశంకర్ అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో భారత దేశం ప్రపంచ దేశాలతో కలిసి పని చేస్తోందని, అయితే దేశ ప్రయోజనాలకే పెద్ద పీట వేస్తోందని చెప్పారు. 'ఆకాశవాణి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అలీన విధానాన్ని అవలంబించిన రోజుల నుంచి అత్యంత ఆత్మవిశ్వాసం నిండిన, దేశ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చే వైఖరికి మారిన విషయాన్ని వివరించారు.అలీన విధానానికిగల చారిత్రక ప్రాధాన్యాన్ని జైశంకర్ ధ్రువీకరించారు. దేశ శక్తి, సామర్థ్యాలు పరిమితంగా ఉన్నపుడు స్వాతంత్ర్యాన్ని బలంగా వ్యక్తీకరించే విధానంగా దీనిని అభివర్ణించారు. భారత దేశ విదేశాంగ విధానంలో ప్రత్యేక శకానికి అలీన విధానం ప్రాతినిధ్యం వహించిందని, అయితే దాని పరిమితులు దానికి ఉన్నాయని చెప్పారు.''అది మన సామర్థ్యాలు పరిమితంగా ఉన్న సమయం. అంతేకాకుండా మన దేశ ప్రయోజనాలకు ఎల్లప్పుడూ పెద్ద పీట వేయని సమయం. కొన్నిసార్లు మనకు దక్కవలసిన ప్రయోజనాలు మనం పొందలేకపోయాం. కానీ అది గతం" అని చెప్పారు. 1990వ దశకంలో ఆర్థిక సంస్కరణలు జరిగిన కాలాన్ని గుర్తు చేస్తూ, ఈ సంస్కరణలు దేశ విదేశాంగ విధానాన్ని మార్చుకోవలసిన అవసరాన్ని తీసుకొచ్చాయన్నారు. ఆర్థిక, దౌత్యపరమైన వ్యూహాల మధ్య విడదీయలేని లంకెను గుర్తిస్తూ ఈ మార్పులు చేయవలసిన అవసరం ఏర్పడిందన్నారు.

# తిరుమల నడకమార్గంలో మరింత పటిష్టంగా భద్రత : ఈవో ధర్మారెడ్డి



తిరుపతి, ఆగష్టు 12:తిరుమల నడకమార్గంలో తల్లిదండ్రులు తమ పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని తిరుమల తిరుపతి దేవస్థానం ఈవో ధర్మారెడ్డి విజ్ఞప్తి చేశారు. అలిపిరి, శ్రీవారిమెట్టు నడక మార్గాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా మరింత పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. తిరుమల అన్నమయ్య భవనంలో శనివారం టీటీడీ, అటవీ, పోలీస్ అధికారులతో ఈవో అత్యవసర సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తిరుమల నడకదారిలో చిన్నారిపై చిరుత దాడి చాలా బాధాకరమన్నారు. నడకమార్గంలో 500 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు.

నడక మార్గానికి ఇరువైపులా కంచె ఏర్పాటు చేసేందుకు సమగ్ర నివేదిక అందించాలని డీఎఫ్ఓను ఆదేశించారు. చిరుత దాడి ఘటనపై సీపీఎఫ్ నాగేశ్వరరావు అధ్వర్యంలో సీన్ రీకన్స్ట్రక్షన్ చేయించి.. చిరుతను బంధించడం కోసం బోనను ఏర్పాటు చేస్తున్నామన్నారు. నడకదారిలో ఇప్పటికే 30 మంది టీటీడీ భద్రత సిబ్బంది, 10 మంది ఫారెస్ట్ సిబ్బంది ఉన్నట్లు చెప్పారు. రెండు నడక మార్గాల్లో ఫారెస్ట్, పోలీస్, టీటీడీ కలిసి మరింత ఎక్కువ మందితో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు.

వందమంది భక్తుల సమూహానికి సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేసి అనుమతించనున్నట్లు చెప్పారు. నడకదారులలో మధ్యాహ్నం 2-3 గంటల వరకు మాత్రమే భక్తులను అనుమతించే అంశంపై సాధ్యాసాధ్యాలను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు త్వరలో అటవీశాఖ అధికారులు అందించే నివేదిక ఆధారంగా పటిష్టమైన భద్రత చర్యలు చేపడతామని ఆయన వివరించారు.

చిన్నపిల్లలతో నడక మార్గాల్లో వచ్చే తల్లిదండ్రులు వారిని జాగ్రత్తగా చూసుకోవాలని ఈవో విజ్ఞప్తి చేశారు. సీసీఎఫ్ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ట్రాంక్విలైజర్స్, బోన్లు వినియోగించి నడక మార్గాల్లో సంచరించే వన్య మృగాలను బంధించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్ఈ -2 జగదీశ్వర్ రెడ్డి, తిరుమల ఏఎస్పీ ముని రామయ్య, డీఈ ఎలక్ట్రికల్ రవి శంకర్ రెడ్డి, డీఎఫ్ ఓ శ్రీనివాసులు, వీజీవోలు బాల్రెడ్డి పాల్గొన్నారు.

# మూడు గంటల కరెంట్ కావాలా..మూడు పంటలు కావాలా ?

**– రాష్ట్ర ఆర్థిక, వైద్యఆరోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు.**




సంగారెడ్డి,ఆగష్టు 12(నేటి నిజం ప్రతినిధి) గోదావరి నీళ్లు సంగారెడ్డి జిల్లా పంట పొలాల్లో తడవాలంటే అది బిఆర్ఎస్ తోనే సాధ్యమవుతుంది రాష్ట్ర ఆర్థిక వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీష్ రావు అన్నారు.

శనివారం కొండాపూర్ మండలం మల్కాపూర్ గ్రామంలోని గోకుల్ ఫంక్షన్ హాల్లో మార్చి నెలలో కురిసిన అకాల వర్షాలు, వడగండ్ల వానలతో పంటలు నష్టపోయిన రైతులకు నేరుగా ఆన్ లైన్ ద్వారా ఇన్ పుట్ సబ్సిడీని పంపిణీ చేశారు. పంట నష్టపోయిన 3666 మంది రైతులకు నాలుగు కోట్ల నాలుగు లక్షల 77 వేల రూపాయలు వారి ఖాతాలకు ఆన్లైన్ ట్రాన్స్ఫర్ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏడాదిలోపు సంగమేశ్వర ప్రాజెక్టు కట్టి ,కాళేశ్వరం నీటిని తెచ్చి మీ పంట పొలాలకు నీళ్లు అందిస్తామని అన్నారు.

రైతులకు 24 గంటల కరెంట్ ఇస్తున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ దన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా 24 గంటల ఉచిత విద్యుత్ లేదన్నారు. కొందరు మూడు గంటల కరెంట్ చాలని అంటున్నారని మూడు గంటల కరెంట్ వ్యవసాయానికి సరిపోతుందా అంటూ ప్రశ్నించారు.

మూడు గంటల కరెంట్ చాలని ఒక పార్టీ అంటే, మోటర్లకు మీటర్లు పెట్టాలని మరో పార్టీ వారు అంటున్నారన్నారు.

కానీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఉచిత విద్యుత్ అందిస్తూ మూడు పంటలు కావాలని ఆశిస్తున్నారని, ఏది కావాలో రైతులు ఆలోచించాలన్నారు.

ధరణి ఉండడంతోనే రైతుకు రైతుబంధు, రైతు బీమా నేరుగా రైతుల ఖాతాల్లో జమఅవుతున్నాయన్నారు. ధరణి వల్ల రైతులు భూములు అమ్మడం,కొనడం సులభతర

మైందన్నారు. ధరణి వల్ల భూమిని మరొకరి పేరు మీదికి మార్చేశక్తి ఎవరికి లేదని, భూ యజమాని చేతి వేలికి మాత్రమే ఉందన్నారు. ధరణితో ఎవరి భూమికి వారే హక్కుదారులయ్యా రన్నారు.

అదే విధంగా ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేస్తు న్నామన్నారు. అకాల వర్షాలు, వడగండ్ల వానలకు పంటలు దెబ్బతిన్న రైతులకు ఎకరాకు రూ.10వేల చొప్పున పరిహారం అందిస్తున్నామన్నారు. సద్ది తిన్న రేవు తలవాలని, రైతుల కోసం పనిచేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ ను ప్రజలు ఆశీర్వాదించాలని మంత్రి కోరారు.

ఈ కార్యక్రమంలో ఎంపీ బీబీ పాటిల్, జడ్పీ చైర్ పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి, తెలంగాణ హ్యాండ్లూమ్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్, కలెక్టర్ డాక్టర్ శరత్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్,ఎమ్మెల్యే మానిక్ రావు, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, మఠం బిక్షపతి, డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మానిక్యం, సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి,రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# న్యూఢిల్లీలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ప్రత్యేక అతిథులుగా హాజరు కావాలని వివిధ రంగాలకు చెందిన విశిష్ట వ్యక్తులకు ఆహ్వానం

న్యూఢిల్లీ, ఆగష్టు 12:ఈ ఏడాది ఆగస్టు 15న ఎర్రకోటపై భారత ప్రధాని ఆవిష్కరించే స్వాతంత్ర్య దినోత్సవ పతాకావిష్కరణ కార్యక్రమంలో దేశం వివిధ ప్రాంతాలకు చెందిన దాదాపు 1,800 మంది ప్రత్యేక అతిథులుగా పాల్గొంటారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఈ ఏడాది 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా శక్తివంతమైన గ్రామాల సర్పంచులు, ఉపాధ్యాయులు, నర్సులు, రైతులు, మత్స్యకారులు, ఢిల్లీలో సెంట్రల్ విస్టా ప్రాజెక్టు నిర్మాణానికి సహకరించిన కార్మికులు, ఖాదీ రంగ కార్మికులు, జాతీయ అవార్డు పొందిన పాఠశాల ఉపాధ్యాయులు, అమృత్ సరోవర్ ప్రాజెక్టు నిర్మాణంలో పాల్గొన్న సరిహద్దు రహదారుల సంస్థ కార్మికులు, దేశం వివిధ ప్రాంతాల్లో అమలు జరుగుతున్న హర్ ఘర్ జల్ యోజన ప్రాజెక్టుల నిర్మాణంలో పాల్గొంటున్న కార్మికులను ఈ ఏడాది న్యూఢిల్లీలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో తమ జీవిత భాగస్వామితో కలిసి పాల్గొవాలని ప్రభుత్వం ఆహ్వానించింది.

ఈ ఏడాది జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు తమ భార్యలతో కలిసి పాల్గొవాలని తెలంగాణ రాష్ట్రానికి చెందిన పలువురు లబ్ధిదారులకు ఆహ్వానం అందింది. వ్యవసాయం, చేపల పెంపకం తదితర రంగాల్లో ఉత్తమ విధానాలు అనుసరిస్తూ లాభాలు ఆర్జిస్తున్న వారిని ప్రభుత్వం ప్రత్యేక అతిథులుగా ఆహ్వానించింది.

# పేద ప్రజల అభ్యున్నతే మా ధ్యేయం.. నన్నపునేని నరేందర్



వరంగల్, ఆగష్టు 12:పేద ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా, నియోజకవర్గ అభివృద్ధే తన మొదటి ఏజెండాగా తాను పని చేస్తున్నానని ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. వరంగల్ 24వ డివిజన్ లో రూ. 2కోట్ల 86 లక్షల వ్యయంతో ఏర్పాటు చేయనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఇతర అభివృద్ధి పనుల కార్యక్రమాలకు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేడు 24వ డివిజన్ లో రెండు కోట్ల ఎనభై ఆరు లక్షలతో అభివృద్ధి పనుల శంకుస్థాపన చేసుకోవడం జరిగిందన్నారు.

కుడా నిధుల నుండి మరో 2కోట్ల పై చిలుకు నిధులు కేటాయించడం జరిగిందని, సుమారు 5కోట్లతో 24వ డివిజన్ లోని అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే నరేందర్ అన్నారు.

ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో, మంత్రి కేటీఆర్ మార్గనిర్దేశంలో నియోజకవర్గాన్ని గొప్పగా అభివృద్ధి చేసుకుంటున్నామని ఎమ్మెల్యే నరేందర్ అన్నారు. వాడ వాడలా సీసీ రోడ్లు, డ్రైనేజి వ్యవస్థను మెరుగు పరుచుకుంటున్నామని, పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తూ అభివృద్ధిలో దూసుకుపోతున్నామని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఆకుతోట తేజస్వి శిరీష్, డివిజన్ అధ్యక్షులు పందికొండ శివరాజ్, ఆర్టీఏ మెంబర్ గోరంట్ల మనోహర్, దాచపెల్లి సీతారాం, మైనారిటీ నాయకులు సద్దాం, ముఖ్య నాయకులు హాజరయ్యారు.

# గొల్ల కురుమలను ఆదుకుంటాం

## -మంత్రి సబితా ఇంద్రారెడ్డి

హైదరాబాద్, ఆగష్టు 12: గొల్ల కురుమలను ఆదుకుంటామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. గొల్ల కురుమ సంఘం మహేశ్వరం నాయకులు స్థలం, కమ్యూనిటీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరతూ శుక్రవారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గొల్ల కురుమలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి సీఎం కేసీఆర్ గొర్రెల పంపిణీ పథకం తీసుకొచ్చి గొల్ల కురుమలకు తగు న్యాయం చేస్తున్నారని అన్నారు.

అర్హులైన గొల్ల కురుమలకు గొర్రెలను పంపిణీ చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నామని అన్నారు. నియోజకవర్గంలోని గొల్ల కురుమల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తున్నామని అన్నారు. గొల్ల కురుమలు ఆర్థికంగా నిలదొక్కుకొని వ్యాపార రంగంలో రాణించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కరోళ్ల చంద్రయ్య ముదిరాజ్, అంబయ్య యాదవ్, మినాజ్ పటేల్, శివగంగ దేవాలయ చైర్మన్ నిమ్మగూడెం సుధీర్‌గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆనందం, కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఆదిల్ అలీ, పీఏసీఎస్ డైరెక్టర్లు పొల్కం బాలయ్య, కడమోని ప్రభాకర్ మహేశ్వరం గ్రామ శాఖ అధక్షుడు దుడ్డు కృష్ణాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# పాలమూరు క్లియరెన్స్‌తో డిండి ఎత్తిపోతలకు మార్గం సుగమం : మండలి చైర్మన్ గుత్తా

నల్లగొండ, ఆగష్టు 12: పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి పర్యావరణ అనుమతులు సాధించడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం అని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పేర్కొన్నారు. పాలమూరు క్లియరెన్స్‌తో డిండి ఎత్తిపోతల పథకానికి లైన్ క్లియర్ అయినట్లేనని ఆయన స్పష్టం చేశారు. గుత్తా సుఖేందర్ రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో ఇవాళ మీడియాతో చిట్ చాట్ చేశారు.

పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టులోని మొత్తం రెండు టీఎంసీల్లో అర టీఎంసీ నీరు డిండి ఎత్తిపోతలకు తరలిస్తారని తెలిపారు. డిండి ద్వారా నల్లగొండ జిల్లాలో 3.61 లక్షల ఎకరాలకు సాగునీరు అందనుందని చెప్పారు. నార్లాపూర్ నుంచి ఏదుల రిజర్వాయర్‌కు.. అక్కడి నుంచి డిండికి గ్రావిటీ ద్వారా నీరు తేవాలని తొలి ప్రతిపాదన ఉంది.

వట్టెం నుంచి ఎత్తిపోతల ద్వారా తేవాలనే రెండో ప్రతిపాదన కూడా తెరపైకి వచ్చింది. రెండింటిలో ఏదో ఒక ప్రతిపాదన ద్వారా డిండికి నీళు రావడం ఖాయం అని గుత్తా సుఖేందర్ రెడ్డి స్పష్టం చేశారు.

కల్వకుర్తి లిఫ్ట్ పథకం రీ జనరేటర్ వాటర్ ద్వారా గత మూడు నాలుగు ఏండ్లుగా డిండి రిజర్వాయర్‌కు వరద వచ్చి అలుగు పోస్తుంది. దీంతో డిండి కింద ఆయకట్టుకు సాగునీరు పుష్కలంగా అందుతుంది. ఈ అలుగు నీటితో నక్కలగండిని నింపొచ్చు. నక్కలగండి 98 శాతం పూర్తి అయింది. గేట్లు బిగిస్తే నీరు నిల్వ ఉండనుంది అని మండలి చైర్మన్ తెలిపారు.

ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం పూర్తికి టెక్నికల్‌గా చాలా సమస్యలు ఎదురవుతున్నాయి. ఆ లోపు నక్కలగండికి డిండి రిజర్వాయర్ నుంచి నీటిని మళ్లించొచ్చని తెలిపారు. ఇక డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా ఇప్పటికే గొట్టిముక్కల 98 శాతం, కిష్టారాంపల్లి, చర్లగూడెం 70 శాతం పూర్తి అయ్యాయి. వీటిని కూడా సహజ వరద ద్వారా కొంత నీటిని నింపొచ్చు. పర్యావరణ అనుమతుల నేపథ్యంలో ఈ పనులు కూడా మరింత వేగంగా పూర్తి కావచ్చు అని గుత్తా సుఖేందర్ రెడ్డి పేర్కొన్నారు.

ఇక కృష్ణా, గోదావరి నీటి వాటాలు తేల్చడంలో కేంద్రం నిర్లక్ష్యం చేస్తుంది అని గుత్తా సుఖేందర్ రెడ్డి మండిపడ్డారు. దీని వాళ్ల తెలంగాణకు 9 ఏండ్లుగా తీవ్రంగా నష్టం జరుగుతుందన్నారు. నదీ జలాల పంపకం పూర్తయితే ఇంకా వేగంగా నీటిని వినియోగించుకునే అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుతం శ్రీశైలం ప్రాజెక్టుకు మరో 100 టీఎంసీలు, సాగర్‌కు మరో 200 టీఎంసీల నీరు వస్తే నిండనున్నాయి. అధికారులు చెబుతున్న లెక్కల ప్రకారం మరో 20, 30 టీఎంసీల నీరు వస్తే సాగర్ మొదటి జోన్ వరకు సాగునీరు ఇవ్వవచ్చు. ఇప్పటికే 30 టీఎంసీల వరకు అందుబాటులో ఉన్నట్లు లెక్కలు వెల్లడిస్తున్నాయని తెలిపారు.

# కాంగ్రెస్ అంటే దొంగరాత్రి కరెంటు.. బీఆర్ఎస్ అంటే 24 గంటల ఉచిత కరెంట్: మంత్రి హరీశ్ రావు

సంగారెడ్డి, ఆగష్టు 12: (నేటినిజం ప్రతినిధి):కాంగ్రెస్ ల అంటే దొంగరాత్రి కరెంటు.. బీఆర్ఎస్ అంటే 24 గంటల ఉచిత కరెంట్ అని మంత్రి హరీశ్ రావు అన్నారు.

తెలంగాణ అభివృద్ధిని చూడలేని కాంగ్రెస్ నేతలు తిట్ల దండకం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో ఉచిత విద్యుత్‌ను ఉత్త విద్యుత్‌గా మార్చారని చెప్పారు. రేవంత్ రెడ్డి 3 గంటల కరెంట్ ఇస్తే 3 ఎకరాల పొలం పారుతుందని చెప్పారు. రేవంత్‌రెడ్డికి ప్రజలే తగిన బుద్ధి



చెప్పాలన్నారు.

సంగారెడ్డిలో లబ్ధిదారులకు బీసీ బంధు చెక్కులను, పంచాయతీ కార్యదర్శులకు రెగ్యులరైజేషన్ పత్రాలను మంత్రి హరీశ్ రావు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ పాలిస్తున్న రాష్ట్రాల్లో ఉచిత కరెంటు ఎందుకు లేదని నిలదీశారు. దేశంలో 24 గంటల కరెంటు ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రంలో గ్రామాల సమగ్రాభివృద్ధి జరుగుతున్నదని తెలిపారు.

3 శాతం జనాభా ఉన్న తెలంగాణ రాష్ట్రానికి 38 శాతం అవార్డులు రావడం ముఖ్యమంత్రి కేసీఆర్ పనితీరుకు నిదర్శనమని మంత్రి హరీశ్ అన్నారు. బీసీలకు రూ.లక్ష ఆర్థిక సాయం చేయడం సంతోషంగా ఉందన్నారు. కులవృత్తులను కాపాడుకోవాలనే ఉద్దేశంతో బీసీ బంధు ఇస్తున్నామని చెప్పారు. వెనుకబడిన వర్గాలవారికి రూ.20 లక్షల ఓవర్సీస్ స్కాలర్‌షిప్ ఇస్తున్నామని చెప్పారు. 35 వేల సెలూన్లు, 60 వేల లాండ్రీలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని వెల్లడించారు. తెలంగాణ రాకముందు 19 బీసీ గురుకులాలు ఉంటే ఇప్పుడు వాటి సంఖ్య 310కి చేరిందన్నారు. బీసీల కోసం ప్రభుత్వం వంద కోట్లు ఖర్చుచేస్తున్నదని తెలిపారు.

# పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు-మంత్రి ఆధ్వర్యంలో సంబురాలు



వనపర్తి, ఆగష్టు 12: పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు లభించడంతో వనపర్తి జిల్లా ఏదుల వీరాంజనేయ స్వామి రిజర్వాయర్ దగ్గర సంబురాలను ఘనంగా నిర్వహించారు. వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి, రైతులు , నాయకులతో కలిసి శుక్రవారం సంబురాల్లో పాల్గొని రిజర్వాయర్‌ను పరిశీలించారు .రిజర్వాయర్ వద్ద ఉన్న టన్నెల్ ను పరిశీలించడంతో పాటు నీళ్లు ఎక్కడి నుంచి ఎలా వస్తాయోనన్న విషయాన్నిరైతులకు వివరించారు . ఈ సందర్భంగా రిజర్వాయర్ లో నిలిచిన నీటిలో సీఎం కేసీఆర్ చిత్ర పటానికి జలాభిషేకం చేశారు. వనపర్తి నియోజకవర్గ పరిధిలో జరిగిన అభివృద్ధి పై రూపొందించిన డ్యాక్యుమెంటరీ ని చూసిన రైతులు ఆనందం వ్యక్తం చేశారు. వనపర్తి నియోజకవర్గ పరిధిలోని 7 మండలాలకు చెందిన రైతులు , నాయకులు సంబురాల్లో ఆనందంగా పాల్గొన్నారు

# నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం-ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

హైదరాబాద్, ఆగష్టు 12:నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తున్నాని అందులో భాగంగా ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు అన్నీ రకాల చర్యలు తీసుకుంటున్నానని ఎమ్మెల్యే కేపీ వివేకాంద్ అన్నారు. శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన ప్రజలు, పార్టీ శ్రేణులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి వారి సమస్యలపై వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయా విభాగాల అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. గాజులరామారం డివిజన్ దేవేందర్‌నగర్, నర్సంహా బస్తీ, పోచమ్మ బస్తీ, కట్టమైసమ్మ బస్తీ, హుస్సేన్ బస్తీ, అబీద్ బస్తీలలో శుక్రవారం కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్ నిర్వహించిన ప్రగతి యాత్ర 99వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాదయాత్ర చేస్తూ ఆయా బస్తీలలో పూర్తి చేసిన రోడ్లు, డ్రైనేజీ వంటి అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజల ఆశీస్సులతో 99 రోజులు ప్రగతి యాత్ర పూర్తి చేసుకుని వంద రోజులకు అడుగుపెడుతున్నందుకు సంతోషంగా ఉందని అన్నారు. ఈ ప్రగతి యాత్ర కార్యక్రమం ద్వారా ఎన్నో సమస్యలు పరిష్కరించామని అన్నారు. ఈ కార్యక్రమంలో గాజులరామారం డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి, జలమండలి జీఎం శ్రీధర్ రెడ్డి, ఎలక్ట్రికల్ డీఈఈ రఘుపతి, జీహెచ్ఎంసీ డీఈఈ రూపాదేవి, జగద్గిరిగుట్ట సీఐ క్రాంతి కుమార్, బీఆర్ఎస్ నాయకుడు అబీద్‌తో పాటు స్థానిక నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# పలువురుకి నివాళులర్పించిన మదన్ లాల్



ఖమ్మం, ఆఆగష్టు 12 (నేటినిజం ప్రతినిధి): వైరా మున్సిపాలిటీ పరిధిలో ద్వారకానగర్ లో శనివారం వైరా మాజీ శాసనసభ్యులు బాణోత్ మదన్ లాల్ పర్యటించారు. ఇటీవలే వాడపల్లి నరసింహారావు మృతి చెందిన విషయం తెలుసుకుని వారి ఇంటికి వెళ్లి నరసింహారావు చిత్ర పటానికి నివాళి అర్పించారు.

అనంతరం నరసింహారావు కుమారుడు వాడపల్లి రామారావును పరామర్శించారు. శ్రీకాకుళం జయమ్మ మృతి చెందిన విషయం తెలుసుకుని అక్కడికి వెళ్ళి జయమ్మ చిత్ర పటానికి నివాళి అర్పించారు. అనంతరం జయమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళి అర్పించిన వారిలో మాదినేని దుర్గా ప్రసాద్, కొత్తా వెంకటేశ్వరరావు, కారుకొండ బోస్, తోటకూర వీరబాబు యాదవ్, యంద్రతి గోపాలరావు, గోళ్ళ కొండ, మడుపల్లి క్రిష్ణా, నల్లగొండ నాని, కొమ్ము సైదులు తదితరులు ఉన్నారు.

# అమాత్య మౌనమేలా....?

- నాగపూర్ టూ అమరావతి గ్రీన్ ఫీల్డ్ హైవే సర్వేలో రైతులకుఅన్యాయం
- బలవంతంగా లాక్కోవడం సమంజసమేనా...?
- మార్కెట్ రేటు ప్రకారమే నష్టపరిహారంచెల్లించాలి ఆందోళనచేసిన రైతులనుఅరెస్ట్ చేయడం అక్రమం
- రాష్ట్ర ప్రభుత్వంపై తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆగ్రహం



ఖమ్మం, ఆఆగష్టు 12 (నేటినిజం ప్రతినిధి): నాగపూర్ టూ అమరావతి గ్రీన్ ఫీల్డ్ హైవే సర్వేలో తెలంగాణ రైతులకు అన్యాయం జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం నోరు విప్పడం లేదని తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తాజాగా రఘునాథ పాలెం మండలంలో జరుగుతున్న సర్వే సందర్భంగా ఆయన స్పందించారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా హైవే నిర్మాణలకు అవసరమైన భూసేకరణ బాధ్యత, పరిహారం ఎంత ఇవ్వాలనే నిర్ణయాధికారం రెండూ రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని అంశాలన్నారు. అలాంటి రాష్ట్ర ప్రభుత్వం కోకా పేట లాంటి చోట ప్రభుత్వ భూములను ఎకరం వందకోట్లకు అమ్మి ఆదాయం పొందిందన్నారు. కానీ రైతుల వద్ద సేకరించిన భూమికి మాత్రం కనీసం ఎకరాకు ఇరవై లక్షలు కూడా ఇవ్వని దౌర్భాగ్య పరిస్థితి తెలంగాణలో ఉందన్నారు. తమది రైతు ప్రభుత్వమని చెప్పుకుంటున్న కేసీఆర్ కు రైతుల గోడు పట్టదా అని ప్రశ్నించారు. ఇదేనా రైతు సంక్షేమం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధికి, హైవే నిర్మాణాలకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకం కాదని... మార్కెట్ విలువ ప్రకారం రైతులకు నష్టపరిహారం చెల్లించాలనేదే తమ ప్రధాన డిమాండ్ అని పేర్కొన్నారు. రఘునాథపాలెంలో ప్రస్తుత మార్కెట్ రేటు ఎకర రూ. కోట్లలో ఉందని దాని ప్రకారమే రైతులకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. అలాకాకుండా ఎకరానికి రూ. 19లక్షలు మాత్రమే చెల్లిస్తాననడం సమంజసం కాదన్నారు. ఇదేంటని ప్రశ్నిస్తూ తమ భూములు ఇవ్వబోమంటూ ఆందోళనకు దిగిన రైతన్నలను బలవంతంగా అరెస్ట్ చేయడం అక్రమమన్నారు. ఘటనపై జిల్లా మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ నోరు విప్పాలన్నారు. తెలంగాణ వ్యాప్తంగా రూ. కోట్లు విలువైన వేలాది ఎకరాల భూములను రైతులు కోల్పోతున్నా రైతు ప్రభుత్వం అని చెప్పుకునే కేసీఆర్ కనీసం స్పందించకపోవడం రైతులపై వారికున్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. సారవంతమైన, ఖనిజ నిక్షేపాలున్నా భూములను అతి తక్కువ ధరకే అప్పనంగా లాక్కోవాలని చూస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం పై పొంగులేటి ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రీన్ ఫీల్డ్ హైవే వెళ్తున్న నిర్వాసితులకు న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీ పక్షాన ఆందోళనలను చేపడతామని హెచ్చరించారు.

# రైతుల దీక్షలను భగ్నం చేసిన పోలీసులు



నిజామాబాద్, ఆగష్టు 12: మండల కేంద్రంలో 46 రోజులుగా కొనసాగుతున్న రైతుల దీక్షలను శనివారం పోలీసులు భగ్నం చేశారు. రెంజల్ నుండి దూపల్లి వైపు వెళ్లే బందల్లా, మాసపురం, శివాలయం నుండి కెనాల్ వరకు వెళ్లే రోడ్డు మార్గాలను బీటీ రోడ్లుగా మార్చాలని డిమాండ్ చేస్తూ రైతులు జూన్ 28న నిరవధిక సమ్మెకు దిగారు. 2015లో రూ. 1.54 కోట్ల నిధులతో స్థానిక ఎమ్మెల్యే షకీల్, ఆనాటి పార్లమెంటు సభ్యురాలు, ప్రస్తుత ఎమ్మెల్సీ కవిత బీటీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఆ పనులు ముందుకు సాగకపోవడంతో రైతులు అష్టకష్టాలు పడ్డారు. ఎనిమిదేళ్లు గడిచి పోతున్నా ఎక్కడేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారడంతో రైతులు అక్రోశానికి గురయ్యారు. గ్రామ రైతులు సంఘటితమై నిరవధిక సమ్మె బాట పట్టారు. రోజుకో కుల సంఘం పెద్దలు దీక్షలో కూర్చుంటూ తమ మద్దతు ప్రకటించారు. శుక్రవారం రైతులు, మహిళలతో పెద్ద ఎత్తున మహాధర్నను నిర్వహించి రోడ్లపైనే వంట వార్పు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే రూ. 3.5 కోట్ల నిధులు మంజూరు చేసినట్టు వాట్సప్ పోస్టింగులు, సోషల్ మీడియా ద్వారా తెలపడం కాదని దీక్షల వద్దకు వచ్చి తమకు స్పష్టమైన హామీ ఇవ్వాలని ఈ సందర్భంగా రైతు నాయకులు డిమాండ్ చేశారు.

శనివారం ఉదయం రైతుల దీక్షలు యథాతతంగా ప్రారంభమయ్యాయి. దీక్షల పక్కనే మండలంలోని పలు గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రోడ్ల నిర్మాణాల కోసం నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్యే షకిల్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. రైతులు, బీఆర్ఎస్ నాయకులు పోటాపోటీగా ఒకరిపై ఒకరు నినాదాలు చేయడంతో వాతావరణం వేడెక్కింది. బోధన్ రూరల్ సీఐ శ్రీనివాస్ రాజ్, బోధన్ టౌన్ సీఐ ప్రేమ్ కుమార్ రంగ ప్రవేశం చేసి పరిస్థితులను అదుపులో పెట్టారు. బీఆర్ఎస్ నాయకులు రైతుల దీక్షల వద్దే టెంటు వేసి బైఠాయించారు. దీంతో ఒకరిపై ఒకరు రెచ్చిపోవడంతో ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. పోలీసులు ఇరువురిని సముదాయించినా ససేమిరా అనడంతో ప్రత్యేక బలగాలను రంగంలోకి దించారు. పోలీసులు రైతుల దీక్షలను భగ్నం చేసి ఐచర్ వ్యాన్ లో రైతులు, రైతు నాయకులను అరెస్టు చేసి తీసుకెళ్లారు. అలాగే బీఆర్ఎస్ నాయకులను మరో వాహనంలో ఎక్కించి స్టేషన్ కు తరలించారు. అనంతరం రైతుల దీక్షల టెంటును పోలీసులు తొలగించారు. సుమారు నాలుగు గంటల పాటు గ్రామంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఎస్సైలు విక్రమ్, నాగనాథ్ నారాయణ సింగ్, ఎస్ఐ రవీందర్ సిబ్బంది ఉన్నారు.

# సంక్షేమానికి మారుపేరు కేసీఆర్...!

**-3 శాతం జనాభా ఉన్న తెలంగాణకు 38 శాతం అవార్డులు వచ్చాయి.**

**-రాష్ట్ర ఆర్థిక వైద్య ఆరోగ్యశాఖల మంత్రి హరీష్ రావు.**

సంగారెడ్డి,ఆగస్టు12 (నేటి నిజం ప్రతినిధి) అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతే ప్రధాన లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర ఆర్థిక వైద్య ఆరోగ్యశాఖల మంత్రి హరీష్ రావు అన్నారు.

శనివారం సంగారెడ్డి లోని పీఎస్ఆర్ గార్డెన్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బిసి కులవృత్తులు, చేతి వృత్తుల వారికి లక్ష రూపాయల ఆర్థిక సహాయం చెక్కుల పంపిణీ, జూనియర్ పంచాయతీ కార్యదర్శుల రెగ్యులరైజేషన్ పత్రాల పంపిణీ, ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం కులవృత్తులను కాపాడుకోవాలనే ఉద్దేశంతో వారికోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు.

బీసీలకు లక్ష రూపాయల ఆర్థిక సహాయం మొదటి విడతలో భాగంగా అసెంబ్లీ నియోజకవర్గానికి 300 మంది లబ్ధిదారులకు లక్ష రూపాయల చెక్కులను పంపిణీ చేస్తున్నామన్నారు.

బీసీల కోసం ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వాలలో అప్పు కోసం బ్యాంకుల చుట్టూ, ఆఫీసుల చుట్టూ తిరగడానికి సరిపోయేదని, తెలంగాణ ప్రభుత్వంలో అప్పు లేదు బ్యాంకు లేదు నేరుగా లబ్ధిదారునికి కులవృత్తులు చేసుకోవడానికి గ్రాంట్ గా అందిస్తున్నామన్నారు. తెలంగాణ రాకముందు 19 బిసి గురుకులాలు ఉంటే, తెలంగాణ వచ్చాక 310 బీసీ గురుకులాలు ఏర్పాటు చేశామన్నారు. వాటిని జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేశామని, ఆడపిల్లల చదువులకు రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేశామని మంత్రి పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి ఓవర్సీస్ పథకం కింద బీసీ విద్యార్థులు విదేశాల్లో చదువుకోవడానికి 20 లక్షలు ఇస్తున్నామన్నారు. 35 వేల సెలూన్లకు, 60 వేల రజకుల లాండ్రీలకు ఉచిత కరెంటు ఇస్తున్నామని, అందుకు ప్రతి ఏడాది 100 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

గీత,చేనేత కార్మికుల కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టామని, గొల్ల కురుమల అభివృద్ధికి గొర్రెల పంపిణీ చేస్తున్నామన్నారు. 70 వేల కోట్లు రైతుబంధు కింద ఇచ్చామని, 5300 కోట్లు రైతు బీమా కింద రైతు కుటుంబాలకు సాయం చేశామన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రైతు బంధు ,రైతు బీమా,24 గంటల ఉచిత కరెంటు అందిస్తున్నామని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం లక్ష రూపాయల రుణమాఫీ చేస్తున్నామని, సంగారెడ్డి జిల్లాకు సంగమేశ్వర బసవేశ్వర ప్రాజెక్టులతో సాగునీటిని అందించన న్నామన్నారు.

ప్రతి పంచాయతీకి ఒక సెక్రటరీని పెట్టామని, తండాలను ,గూడాలను చిన్నచిన్న గ్రామాలను గ్రామపంచాయతీలుగా చేసి, ప్రతి గ్రామపంచాయతీకి పంచాయతీ కార్యదర్శిలను నియమించిన ఘనత కెసిఆర్ దే నన్నారు. ఏ గ్రామపంచాయతీకి వెళ్లినా గ్రామాలు పచ్చగా ,పరిశుభ్రంగా మారాయన్నారు. జూనియర్ పంచాయతీ సెక్రెటరీ లకు రెగ్యులరైజ్ చేస్తున్నామని, ఆర్టీసీ వాళ్లు ప్రభుత్వ ఉద్యోగులయ్యా రన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో 82% ప్రసవాలు జరుగుతున్నాయని, ఒకప్పుడు నేను రాను బిడ్డ సరుకారు దవఖానకు అంటే, ఇప్పుడు పోదాం పద బిడ్డో సర్కారు దావఖానకు అంటున్నారని, ఆ దిశగా ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేసిందన్నారు. సంగారెడ్డి జిల్లాకు 500 కోట్లతో మెడికల్ కాలేజీ, 40 కోట్లతో నర్సింగ్ కాలేజీ, 24 కోట్లతో క్రిటికల్ కేర్ యూనిట్ను మంజూరు చేసామని గుర్తు చేశారు.

సంక్షేమానికి మారుపేరు కేసీఆర్ అని, అభివృద్ధి సంక్షేమంలో తెలంగాణ ప్రభుత్వం ముందుకు వెళుతున్నదని ప్రజలకు ఇచ్చిన ప్రతి మాట నిలబెట్టుకునే ప్రభుత్వం బీఆర్ఎస్ అన్నారు. రెగ్యులరైజ్ అయిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు, ఇండ్ల పట్టాలు పొందుతున్న లబ్ధిదారులకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు.

అనంతరం 15 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు రెగ్యులరైజేషన్ పత్రాలు, గంగారం సైదాపూర్ ,మారేపల్లి గ్రామాల లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాలు, బీసీ కుల వృత్తుల లబ్ధిదారులకు జంబో చెక్కును మంత్రి అందజేశారు.



# విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపడానికే క్రీడా పోటీలు

## -అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి నరేందర్ రెడ్డి
## -అల్ ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో ప్రారంభమైన స్వాతంత్ర్య దినోత్సవ ఖేల్



కరీంనగర్, ఆగష్టు 12: (నేటినిజం ప్రతినిధి): కరీంనగర్ పట్టణ పరిధిలోని కొత్తపల్లి అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో శనివారం స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని అల్ఫోర్స్ ఖేల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా వి నరేందర్ రెడ్డి హాజరై, అల్ఫోర్స్ ఖేల్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులలో స్ఫూర్తి నింపడానికై పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని పలు ప్రతిభా పాటవ పోటీలను చాలా ఆదర్శంగా నిర్వహించడం జరుగుతున్నదని తెలిపారు.

క్రీడలతో విద్యార్థులకు మానసిక ఉల్లాసం కలుగుతుందని, ఒత్తిడినుండి ఉపశమనం పొందవచ్చని చెప్పారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరు ఏదో ఒక క్రీడలో పాల్గొని, కార్యకలాపాలను ఉత్సాహంగా పూర్తి చేసుకోవాలని సూచించారు. నేడు చాలా మంది కనీస వ్యాయమం లేకపోయేసరికి పలు రోగాల బారిన పడుతున్నారని అన్నారు. జీవనాధారాన్ని సైతం కోల్పోతున్నారని అవేదన వ్యక్తం చేస్తూ, ప్రతి ఒక్కరు కనీస సమయాన్ని న్యాయమానికి కేటాయించి చక్కటి జీవితాన్ని అనుభవించాలని, ఆర్థిక వనరులను పెంపొందించుకోవాలని సూచించారు.

స్వాతంత్ర్య దినోత్సవం, క్రీడల పట్ల సంయుక్తంగా అవగాహన కల్పించడానికై ఉత్సాహంగా విద్యార్థులకుఖోఖో, కబడ్డి, వాలీబాల్, పుట్బాల్, వెల్బాల్, ఆర్చరీ, హాకీ, టెన్నికాయిట్, చెస్, రన్నింగ్, క్రికెట్ పోటీలను బాలబాలికలకు వేరు వేరుగా నిర్వహించడం జరిగినదని అన్నారు. గెలుపొందిన వారికి స్వాతంత్ర్య దినోత్సవాన చాలా గొప్పగా నిర్వహించే వేడుకలలో బహుమతులను ప్రదానం చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరు భారతదేశ ఔనత్యాన్ని అన్ని కోణాల్లో సంరక్షించి, పెంపొందించి దేశ అభివృద్ధికి తోడ్పటునందించి చరిత్ర పుటల్లో ఉండిపోవాలని కోరారు. సుమారు 1300 మంది విద్యార్థులు వివిధ పోటీలలో పాల్గొని, ఉత్సాహాన్ని ప్రదర్శించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# తోంబర్రావుపేట గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా

## -ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచిత స్కూల్ బ్యాగ్స్ పంపిణీ



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 12:(నేటినిజం ప్రతినిధి): : తోంబర్రావుపేట గ్రామాన్ని భవిష్యత్తులో అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని బీఆర్ఎస్ సీనియర్ నేత డాక్టర్ గోలి మోహన్ అన్నారు. శనివారంవేడివల్లి మండలం తోంబర్రావుపేట గ్రామాన్ని డాక్టర్ గోలి మోహన్ సందర్శించారు.

ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ధర్మారెడ్డి, విద్యా కమిటీ సభ్యులు పాఠశాల యాజమాన్యం గ్రామానికి విచ్చేసిన డాక్టర్ గోలి మోహన్ ని సాధనంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ధర్మారెడ్డి మాట్లాడుతూ మారుమూల ప్రాంతమైన తోంబర్రావుపేట గ్రామాన్ని డాక్టర్ గోలి మోహన్ సందర్శించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

ఇప్పటివరకు ఏ నాయకుడు కూడా సందర్శించలేదని, పాఠశాలకు ఎలాంటి సహాయం చేయలేదని, గ్రామ ప్రజల ఐక్యతతో చదువుకునే పిల్లలను ప్రైవేటుకు స్కూలుకు పంపకుండా ప్రభుత్వ పాఠశలోనే చదివించుకుంటున్నామని గోలి మోహన్ కు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం మనబడి మన ఊరు కార్యక్రమంలో భాగంగా గ్రామాన్ని ఎంపిక చేసినప్పటికి స్థానిక శాసన సభ్యులు అందుబాటులో లేకపోవడం వల్ల గ్రామంలో అనేక సమస్యలు నెలకొన్నాయని గోలి మోహన్ దృష్టికి తీసుకెళ్లారు. వేములవాడని యోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్న గోలి మోహన్ ను కొనియాడారు. చదువు, ఉపాధి, ఉద్యోగం వైపు యువకులను ముందుకు తీసుకెళ్ళున్నారనే సదుద్దేశ్యంతో గ్రామానికి ఆహ్వానిచ్చినట్లు గోలి మోహన్ కు తెలిపారు. గ్రామంలో యువత చదువుకుని ఉద్యోగాలి లేక గ్రామంలోనే వ్యవసాయం చేసుకుంటున్నారని తెలిపారు. యువతకు ఏదైనా సరైన మార్గం చూపాలని కోరారు. చాలా మంది గల్ఫ్ దేశాలకు వెళ్లి, ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, అలాంటి వారి కోసం ఏదైనా పరిశ్రమ నెలకొల్పాలని కోరారు. అనంతరం డాక్టర్ గోలి మోహన్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతమైన తొంభారావుపేటను అన్ని విధాల అభివృద్ధి చేయడానికి తన వంతు సహాయ, సహకారాలు ఎల్లవేళలా అందిస్తానని అన్నారు. గ్రామంలో అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి ఉండి ఆర్థికంగా ఎదగాలని అన్నారు. గ్రామంలో చదువుకున్న యువత అమెరికా, లండన్,కెనడా లాంటి దేశాలలో ఉద్యోగాలకు వెళ్లేందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. గ్రామంలో ఉన్న యువతీ, యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని భరోసా కల్పించారు. అనంతరం పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు ఉచిత స్కూల్ బ్యాగ్స్ పంపిణీ చేసి, ప్రభుత్వ పాటశాల విద్య ప్రాధాన్యతను వివరించారు. అనంతరం గ్రామ ప్రజలు, సర్పంచ్ యువకులు, డాక్టర్ గోలి మోహన్ ని శాలువాతో సత్కరించారు.

# వరద బాధితుల కోసం పబ్లిక్ వాయిస్ ఫోరం ఆర్థిక సాయం



హైదరాబాద్, ఆగష్టు 12: ములుగు జిల్లాలో సీతక్కతో కలిసి ముప్పు గ్రామాల్లో పబ్లిక్ వాయిస్ పోరం జిల్లా అధ్యక్షుడు పడిగళ్ళ అశోక్, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.యాదగిరి, జిల్లా ఉపాధ్యక్షులు ఎం.వేణు,శేఖర్ ట్రెజరర్ అరుణ్ ప్రసాద్, పట్టణ అధ్యక్షుడు శ్రావణ్ కుమార్, సలహాదారులు వై నర్సింలు, రాజు, తేజ పర్యటించారు. గతంలో పబ్లిక్ వాయిస్ పోరం ఆధ్వర్యంలో వరద బాధితుల సహాయ నిధి సేకరించిన మొత్తం నిధి రూ.1,24,974లు గోవిందరావుపేట మండలం లో కర్లపల్లి చంద్రు తాండ ప్రాజెక్టు నగర్ గ్రామాల ప్రజలను కలిసి వస్తు రూపంలో, నగదు రూపంలో పబ్లిక్ వాయిన్ ఫోరం ఆధ్వర్యంలో అందజేశారు.వరద బాధితుల కోసం సేకరించిన సహాయ నిధిని ప్రత్యక్షంగా సీతక్క సహకారంతో, ఆమె సూచనతో గ్రామాల్లో పర్యటించి పబ్లిక్ వాయిస్ బృందం వికారాబాద్ టీం సభ్యులు ప్రజలకు అందజేశారు. అదేవిధంగా వికారాబాద్ మున్సిపల్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు వారి సమస్యలపైన సీతక్కకి మెమొరాండంను పబ్లిక్ వాయిస్ తరపున సీతక్కకు అందజేయడం జరిగింది. ఆమె సానుకూలంగా స్పందించి తన శక్తి మేరకు మున్సిపల్ ఔట్ సో ర్సింగ్ ఉద్యోగుల పర్మినెంట్ కోసం కృషి చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది.

# ఆయిల్ పామ్ సాగు ప్రోత్సహించడానికి 11 రాష్ట్రాల్లోని 49 జిల్లాల్లో ప్రత్యేక కార్యక్రమం

న్యూఢిల్లీ, ఆగష్టు 12:నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ - ఆయిల్ పామ్ కింద ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ యూనిట్లతో కలిసి రాష్ట్ర ప్రభుత్వాలు ఆయిల్ పామ్ సాగు ప్రోత్సహించడానికి ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టాయి. 2023 జూలై 25న 'మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్ డ్రైవ్' ప్రారంభమయింది. వంట నూనెల ఉత్పత్తిలో స్వావలంబన సాధించి రైతులను ప్రోత్సహించడానికి కార్యక్రమం అమలు జరిగింది. 2025-26 నాటికి ఆయిల్ పామ్ ఉత్పత్తిలోకి 6.5 లక్షల హెక్టార్ల అదనపు విస్తీర్ణాన్ని తీసుకురావాలనే లక్ష్యాన్ని చేరుకోవడానికి ఈ కార్యక్ర మం దోహదపడుతుంది. ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, గోవా, కర్ణాటక, మిజోరం, నాగాలాండ్, ఒడిశా, తమిళనాడు, తెలంగాణ, త్రిపుర రాష్ట్రాల్లో ఆయిల్ పామ్ తోటల పెంపకం ఎక్కువగా జరుగుతోంది. .పతంజలి ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్, గోద్రేజ్ అగ్రోవెట్, 3 ఎఫ్ వంటి ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ కంపెనీలు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నాయి. వీటితో పాటు కేఈ కల్టివేషన్, నవభారత్ వంటి ఇతర ప్రాంతీయ సంస్థలు కూడా కార్యక్రమంలో పాల్గొన్నాయి. మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్ కార్యక్రమం 2023 ఆగస్టు 12 న ముగిసింది. కార్యక్రమంలో భాగంగా 11 రాష్ట్రాల్లోని 49 జిల్లాల్లోని 77 గ్రామాలలో సుమారు 3500 హెక్టార్లలో 7000 మందికి పైగా రైతులు ఆయిల్ పామ్ సాగు ప్రారంభించారు. 5.00 లక్షలకు పైగా ఆయిల్ పామ్ మొక్కలు నాటారు. మెగా ప్లాంటేషన్ డ్రైవ్ లో భాగంగా ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఉత్పత్తి ఎక్కువ చేయడానికి రైతుల కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాయి. విభాగం అధికారుల సహకారంతో రైతుల కోసం సాంకేతిక శిక్షణ తరగతులు నిర్వహించారు. అధికారులు, రైతులకు సాంకేతిక అంశాలపై మరింత అవగాహన కల్పించడం లక్ష్యంగా కార్యక్రమాలు అమలు జరిగాయి. ఉత్పత్తి ఎక్కువ చేసి ఎక్కువ ఆదాయం లభించేలా చూసేందుకు అనుసరించాల్సిన విధానాలను వివరించారు.

జాతీయ స్థాయిలో నిర్వహించిన మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్ కార్యక్రమంలో సీనియర్ రాజకీయ నాయకులు, శాఖ అధికారులు, గ్రామ పంచాయతీ సభ్యులు పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# వరదల్లో ప్రాణ రక్షణ దాతలు - ములుగు జిల్లా విపత్తు రక్షణ / ప్రతిస్పందన బృందం.

**- పోలీస్ కానిస్టేబుల్ శ్రీకాంత్ రాంబాబు ధైర్య సాహసాలకు దక్కిన రివార్డ్**
**- అభినందనలు తెలియజేసిన జిల్లా ఎస్పీ శ్రీ గౌష్ ఆలం ఐ పి ఎస్**

ములుగు , ఆగష్టు 12: (నేటినిజం ప్రతినిధి): ములుగు జిల్లాలో గత జూలై నెలలో కురిసిన భారీ వర్షాలకు కుంటలు చెరువులు వాగులు పొంగి పొర్లగా ఆకస్మికంగా సంభవించిన వరదల్లో అనేక గ్రామాలు గుర్తుకోయగూడాలు,జంతు జీవ జాతులు వరద నీటిలో చిక్కుకుపోగా అసాధారణమైన ధైర్య సాహసాలతో ప్రకృతిని సైతం ఎదిరించి వరదల్లో చిక్కుకున్న అనేక మంది ప్రాణాలను కాపాడిన ములుగు జిల్లా పోలీస్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ టీం లొ ని ఇద్దరు కానిస్టేబుల్ లకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రివార్డును ప్రకటించింది.

అందులో భాగంగా ములుగు జిల్లాలొ సంభవించిన వరదల్లో ధైర్య సాహసాలతో సేవలందించిన జి రాంబాబు పోలీస్ కానిస్టేబుల్ 85, కే శ్రీకాంత్ పోలీస్ కానిస్టేబుల్ 140 లకు ఈ జాబితాలో చోటు దక్కింది.ప్రస్తుతం వీరు స్పెషల్ పార్టీ మరియు జిల్లా ఎస్పీ శ్రీ గౌష్ ఆలం గారిచే ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడిన జిల్లా విపత్తు ప్రతిస్పందన బృందం లొ విధులు నిర్వహిస్తున్నారు.

ఈనెల ఆగస్టు 15న జరగబోవు స్వాతంత్ర దినోత్సవం నాడు గోల్కొండ కోట నందు గౌరవ ముఖ్యమంత్రి గారిచే వీరు ఇరువురు రివార్డ్ అందుకోవడం జరుగుతుంది

# పాకిస్తాన్ తాత్కాలిక ప్రధానమంత్రి అన్వర్ ఉల్ హక్ కాకర్

న్యూఢిల్లీ, ఆగష్టు 12: పాకిస్థాన్ తాత్కాలిక ప్రధానమంత్రిగా అన్వర్ ఉల్ హక్ కాకర్ ఎన్నికయ్యారు. పాకిస్థాన్ జాతీయ అసెంబ్లీ రద్దు కావడంతో పదవీ విరమణ చేసిన ప్రధాని షెహబాజ్ షరీఫ్, ప్రతిపక్ష నాయకుడు రాజా రియాజ్ శనివారం సమావేశమయ్యారు. తాత్కాలిక ప్రధానిగా ఎవరిని ఎన్నుకోవాలి అన్న దానిపై చర్చించి ఒక అభిప్రాయానికి వచ్చారు. చిన్న ప్రావిన్స్‌కు చెందిన బలూచిస్థాన్ అవామీ పార్టీ (బీఏపీ) చట్టసభ్యుడు కాకర్‌ను తాత్కాలిక ప్రధానిగా ఎంపిక చేశారు. ఆయన నియామకాన్ని పాక్ అధ్యక్షుడు ఆరిఫ్ అల్వీ ఆమోదించారు. పాకిస్థాన్ ప్రధానమంత్రి కార్యాలయం ఈ మేరకు శనివారం ప్రకటించింది.

కాగా, జాతీయ అసెంబ్లీ పదవీ కాలం మూడు రోజుల్లో ముగియనుండటంతో రద్దు చేయాలని ప్రధాని షెహబాజ్ షరీఫ్ సిఫార్సు చేశారు. దీంతో ఈ నెల 9న పాక్ జాతీయ అసెంబ్లీ రద్దైంది. ఆ దేశ రాజ్యాంగం ప్రకారం 90 రోజుల్లో సాధారణ ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నది. ఎన్నికలు జరిగి కొత్త ప్రభుత్వం ఏర్పడే వరకు అన్వర్ ఉల్ హక్ కాకర్ తాత్కాలిక ప్రధానిగా వ్యవహరిస్తారు.

# గోల్కొండలో స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లను సమీక్షించిన డీజీపీ

హైదరాబాద్, ఆగష్టు 12:చారిత్రక గోల్కొండ కోటలో ఆగస్టు 15న నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను డీజీపీ అంజనీకుమార్‌శుక్రవారం వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఆగస్టు 15న ఉదయం ముఖ్యమంత్రి కేసీఆర్ సికింద్రాబాద్ అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించిన అనంతరం ఉదయం 11 గంటలకు గోల్కొండ కోటలో జాతీయ పతాకా విష్కరణ గావిస్తారని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ఎలాంటి అవాంతరాలు జరుగకుండా చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు.వేడుకలకు హాజరయ్యే వారు సభాప్రాంగణంలో ఎంత దూరంలో ఉన్నా కార్యక్రమాన్ని స్పష్టంగా వీక్షించేందుకు 14 పెద్ద ఎల్ఈడీ లను ఏర్పాటు చేశామని సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ అశోక్ రెడ్డి వివరించారు. కార్యక్రమ లైవ్ కవరేజ్ కోసం 10 కెమెరా యూనిట్ లను, లైవ్ కవరేజ్ లింకింగ్ కు అవసరమైన చర్యలు తీసుకున్నామని అన్నారు. సభాప్రాంగణంలో సర్వం సిద్ధం సభకు వచ్చిన ముఖ్య అతిథులు, అధికారులు, సందర్శకులు విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు డీజీపీకి వివరించారు.

హైదరాబాద్ జలమండలి ఆధ్వర్యంలో లక్ష వాటర్ ప్యాకెట్లు , 25 వేల వాటర్ బాటిళ్లు ఏర్పాటు చేశామని జలమండలి ఎం.డీ దాన కిషోర్ వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్యసేవలు అందించేందుకు సభా ప్రాంగణంలో 4 అంబులెన్సులు,, గోల్కొండ ప్రైమరీ హెల్త్ సెంటర్లో ఒగ గదిని సిద్దంగా ఉంచామని వైద్యశాఖ అధికారులు తెలిపారు. మూడు ఫైర్ ఇంజిన్లు , ఆరు బెస్ట్ బైక్స్, నాలుగు ల్యాడర్లు ఏర్పాటు చేయనున్నామని ఫైర్ శాఖ అధికారులు తెలిపారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా ప్రత్యేక జనరేటర్లు, వర్షం పడినా ఇబ్బందులు లేకుండా వాటర్ ప్రూఫ్ షెడ్ లను ఏర్పాటు చేశామని విద్యుత్ శాఖ, రహదారులు భవనాల శాఖ కార్యదర్శి శ్రీనివాస రాజు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కి దాదాపు 1200 మంది కళాకారులు స్వాగతం పలుకుతారని సాంస్కృతిక శాఖ డైరెక్టర్ హరి కృష్ణ వివరించారు. గోల్కొండ కోట పరిసర ప్రాంతాలలో పార్కింగ్ వివరాలను డీజీపీ అడిగి తెలుసుకున్నారు. మంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు,ఎమ్మెల్యేలకు, ఎంపీలకు, మీడియా వాహనాలకు సందర్శకులకు వేరు వేరుగా పార్కింగ్ స్థలాలు కేటాయించామన్నారు.జీహెచ్ ఎంసీ ఆధ్వర్యంలో శానిటేషన్ తదితర ఏర్పాట్లను చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, అడిషనల్ డీజీ స్వాతి లక్రా, విద్యా శాఖ కార్యదర్శి వాకాటి కరుణ, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన, ప్రోటోకాల్ డైరెక్టర్ అరవింద్ సింగ్, టూరిజం కార్పొరేషన్ ఎండీ మనోహర్, టీఎస్ఐఐసీ ఎండి నర్సింహారెడ్డి తదితరులు హాజరయ్యారు.

# రాజన్న సేవలో హుస్నాబాద్ ఎమ్మెల్యే ఒడితేల సతీష్ కుమార్



రాజన్న సిరిసిల్ల, ఆఆగష్టు 12:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామిని శనివారం హుస్నాబాద్ ఎమ్మెల్యే ఒడితేల సతీష్ కుమార్ దర్శించుకున్నారు. దర్శనము అనంతరం ఎమ్మెల్యే దంపతులకు నాగిరెడ్డి మండపంలో అర్చకులు వేదోక్త ఆశీర్వచనం చేయగా, ఆలయ పర్యవేక్షకులు బి తిరుపతి రావు శేషవస్త్రం కప్పి,లడ్డు ప్రసాదం అందజేశారు.

# ఎస్సై ఉద్యోగం పొందిన స్వాతి ఉన్నత స్థాయికి చేరుకోవాలి

## -బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు డాక్టర్ గోలి మోహన్



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 12:(నేటినిజం ప్రతినిధి): ఇటీవల వెలువడిన పోలీస్ ఉద్యోగాలలో వేములవాడ పట్టణానికి చెందిన కొప్పుల స్వాతి ఎస్సై రావడం పట్ల బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు డాక్టర్ గోలి మోహన్ హర్షం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా డాక్టర్ గోలి మోహన్ కొప్పుల స్వాతి పోలీసే వృత్తని ఎంచుకొని, ఎస్సై ఉద్యోగం పొందడం గర్వించదగ్గ విషయమని అన్నారు. యువత సరియైన సమయంలో సరైన దృష్టి పెట్టి చదివితే ఎలాంటి ఉద్యోగమైన సాధించవచ్చన్నారు. సమయాన్ని వృధా చేయకుండా చదివితే ప్రతి ఒక్కరి లక్ష్యం నెరవేరుతుందన్నారు. రాబోయే రోజుల్లో వేములవాడ నియోజకవర్గంలో ఒక మంచి కోచింగ్ సెంటర్ ను నిర్మించి, ఉచితంగా సివిల్ సర్వీస్, గ్రూప్ -1, గ్రూప్ -2, ఇతర ఉద్యోగాల కోసం సన్నద్ధం అవడానికి అవడానికి ప్రత్యేక కృషి చేస్తానని అన్నారు. స్వాతి లాంటి అమ్మాయిలు ధైర్యంగా ముందుకు వచ్చి, ఉద్యోగాలు సంపాదించాలని సూచించారు. భవిష్యత్తులో సాంకేతికతనే ప్రపంచం ముందుకు నడుస్తుందని, అందువల్ల నైపుణ్యంతో కూడినటువంటి విద్యను అభ్యసించాలని సూచించారు. చదువుకున్న ప్రతి ఒక్కరికి ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా ప్రణాళికతో ముందుకు వస్తున్నానని, యువత ఊర్లో కాదు ఉద్యోగంలో ఉండాలనే శీర్షికతో ఎంచుకున్నసంకల్పానికి వేములవాడ నియోజకవర్గంలోని యువత ముందుకు రావాలని కోరారు. ఎస్సై పొందిన స్వాతి మరిన్ని పదోన్నతులు పొంది, ఉన్నత స్థానంకు చేరుకోవాల్ని ఆకాంక్షించారు.

# రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ ను గెలిపించాలి

## -జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 12:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని 19, 20 వార్డులలో శనివారం జిల్లా అధ్యక్షులు ఆది శ్రీనివాస్ సందర్శించారు.

ఈ సందర్బంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాబోయే ఎమ్మెల్యే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకే వస్తే ప్రతి ఇంటికి 500 సిలిండర్, లక్ష ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, బీడీ కార్మికుల, ఒంటరి మహిళలకు 4000 పింఛన్, అర్హులందరికీ ఇందిరమ్మఇల్లు, ఇల్లు కట్టుకునే పేదవారికి ఐదు లక్షలు ఇస్తామని అన్నారు.

కాంగ్రెస్ పార్టీ బడుగు, బలహీన వర్గాల కోసమే పని చేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి, కూరగాయల కొమురయ్య, చిలుక రమేష్, చంద్రగిరి శ్రీనివాస్, మంత్రి నాగభూషణం, లక్ష్మి, పరుశరాములు, లహరి, వస్తాది గణేష్ ఉన్నారు.

# కార్మికుల సమ్మెతో నిలిచిపోయిన ఓబీ పనులు

ఆదిలాబాద్, ఆగష్టు 12:శ్రీరాం పూర్ ఏరియాలోని ఎస్ఆర్పి ఓసీ 2, లో కార్మికుల సమ్మెతో గత మూడు రోజు లుగా ఓవర్ బర్డెన్ (ఓబీ) పూర్తిగా నిలిచిపోయాయి. ఓబీ కాంట్రాక్టర్ సీఆర్ఆర్ కంపెనీ సైట్ ఇన్చార్జి విష్ణు అత్యుత్సాహం చూపుతూ అప్రకటితంగా కార్మికుల వేతనాల్లో కోతలు విధిస్తూ మానసికంగా వేధించడంతో శనివారం కార్మికులు నిరసన వ్యక్తం చేసి కాంట్రాక్ట్ క్యాంప్ వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. పలుమార్లు యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లిన స్పందించకపోవడంతో గత మూడు రోజులుగా పనులను పూర్తిగా నిలిపివేసి వేతనంలో కోత విధిస్తున్న జీతాలను తిరిగి చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.యాజమాన్యం స్పందించకుండా వారిపై నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తూ ప్రతీకార చర్యగా శనివారం క్యాంపులో స్థానికేతర కార్మికులకు భోజనాలు పూర్తిగా నిలిపివేసింది. దీంతో క్యాంపులో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉండగా.. స్థానిక తోటి కార్మికులు మానవతా దృక్పథంతో వారికి భోజనం ఏర్పాట్లు చేశారు. విషయం తెలుసుకున్న శ్రీరాం పూర్ జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి సం ఘటన స్థలానికి చేరుకొని కార్మికులను నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయిన ప్పటికి కార్మికులు అంగీకరించకపోవడంతో ఈనెల 30 వరకు సీఆర్ఆర్ కంపెనీ యాజమాన్య ంతో మాట్లాడి మిగతా ఓబీ కాంట్రా క్టర్లు చెల్లిస్తున్న విధంగానే తమకు చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు.

Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com